

భారత దేశ రాజకీయాలలో సూపర్ స్టార్, తెలుగు జాతి గర్వించదగ్గ ఆణిముత్యం చంద్రబాబు. భారత దేశంలో ఆయనకు ఉన్న క్రేజ ఏ నాయకులకు లేదు. చంద్రబాబు ఒక వ్యక్తి కాదు సామూహిక శక్తి. ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు సమపాళ్లలో అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్,** ఎమ్మెల్సీ



గురువారం 14.05.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 22 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




## మేడ్ ఇన్ ఆంధ్ర.. మేడ్ ఫర్ ఇండియా.. మేడ్ ఫర్ ది వరల్డ్

# ఇదే మన లక్ష్యం!



**20 లక్షల ఉద్యోగాల లక్ష్య సాధనకు ఎంఎస్ఎంఈలు కీలకం**

**23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 24 లక్షల ఉద్యోగాలు కల్పించే 800 ఒప్పందాలు**

**మూడు నెలల్లో 100 కంపెనీలు ఎన్ఎస్ఈలో లిస్ట్ అయ్యేలా ఎంఎస్ఎంఈ శాఖ పని చేయాలి**

**ఎస్ఎంఈ ఐపిఓ అవగాహన సదస్సులో మంత్రి నారా లోకేష్**


**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో 20 లక్షల ఉద్యోగాల లక్ష్య సాధనలో ఎంఎస్ఎంఈల పాత్ర అత్యంత కీలకమని ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. "మేడ్ ఇన్ ఆంధ్ర – మేడ్ ఫర్ ఇండియా – మేడ్ ఫర్ ది వరల్డ్" లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సిఐఐ సంయుక్తంగా నిర్వహించిన 'SME IPO --Alternative Funding Option For Growth'' అవగాహన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఎంఎస్ఎంఈలకు మూలధన మార్కెట్ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... యువగళం పాదయాత్రే 20 లక్షల ఉద్యోగాల లక్ష్యానికి ప్రేరణ

యువగళం పాదయాత్రలో తనకు ఎదురైన ఒక సంఘటన 20 లక్షల ఉద్యోగాల లక్ష్యానికి ప్రేరణగా నిలిచిందని మంత్రి లోకేష్ తెలిపారు. "226 రోజులు, 3132 కిలోమీటర్లు నడిచిన యువగళం పాదయాత్రలో ఎన్నో కుటుంబాల కష్టాలు, ఆశలు, ఆకాంక్షలను దగ్గరగా చూశాను. ఒకరోజు పెనుగొండలో కియా వద్ద సెల్ఫీలు దిగేందుకు దారుణమైన ఎండల్లో 23 కి.మీ నన్ను జాతీయ రహదారిపై నడిపించారు. అక్కడే కియా అనుబంధ సంస్థల్లో పని చేస్తున్న పద్మావతి అనే చెల్లి నాతో కలిసి నడిచింది. కియా, అనుబంధ పరిశ్రమలు రాకముందు ఆమె గృహిణి. బాగా చదువుకుంది కానీ ఉద్యోగం చేయలేదు. కియా అనుబంధ సంస్థలు వచ్చిన తరువాత కుటుంబ సభ్యులను ఒప్పించి ఉద్యోగంలో చేరింది. నెలకు రూ. 30 వేలు సంపాదిస్తోంది. అప్పటివరకు భర్త మీద ఆధారపడిన ఆమె, ఇప్పుడు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని కూడా చూసుకుంటోంది. ఆమె కథ విన్న తరువాత నాకు ఉద్యోగ కల్పన ఎంత ముఖ్యమో అర్థమైంది. ఆ ఆలోచనల నుంచే 20 లక్షల ఉద్యోగాల లక్ష్యం పుట్టింది. మేము ఇచ్చిన మ్యానిఫెస్టో 'సూపర్ 6' హామీల్లో కూడా మొదటి హామీ 20 లక్షల ఉద్యోగాల కల్పనే. ఈ లక్ష్యసాధన కోసం అందరం పని చేస్తున్నాం." అని పేర్కొన్నారు.

**పెట్టుబడులకు గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ :** "గత 23 నెలల్లో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల గమ్యస్థానంగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర బ్రాండ్ అంబాసిడర్‌లా ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తూ పెట్టుబడులను ఆకర్షిస్తున్నారు. మిగతా 2లో...

## పొదుపు మంత్రంతోనే ఆర్థిక స్థిరత్వం

**ప్రధాని సూచనలు పాటిద్దాం**



- యుద్ధ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గించాలి
- స్వదేశీ పర్యాటకం - వర్క్ ఫ్రమ్ హోమ్‌కే ప్రాధాన్యత
- రాష్ట్ర ప్రభుత్వ కార్యాచరణపై రెండ్రోజుల్లో విధాన ప్రకటన
- ఆటోపైలట్ మోడ్‌లో పరిశ్రమలకు అనుమతులు
- వైద్య రంగంలో అద్భుత అవకాశాలు-యువత అందిపుచ్చుకోవాలి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమ ఆసియా యుద్ధ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన 8 అంశాలను పాటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. ఒకటి రెండు రోజుల్లో దీనిపై రాష్ట్ర ప్రభుత్వ పరంగా కూడా ఓ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రభుత్వాలతో పాటు పౌరులు కూడా బాధ్యతగా ఉండి తాత్కాలికంగా వచ్చే ఇబ్బందులను అధిగమించాలని సూచించారు. పెట్రోలు, డీజిల్ వినియోగం తగ్గించాలని, దీని వల్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందన్నారు. 'వర్క్ ఫ్రమ్ హోమ్ అనేది రియాలిటీ. ఇంటి నుంచే ప్రపంచం మొత్తం పనిచేసే పరిస్థితి వస్తుంది. దీనిని ప్రోత్సహించాలి. ప్రభుత్వంలోనూ ఈ తరహా విధానాన్ని అమలు చేసే పరిస్థితులు వస్తాయి. దేశం మొత్తం దుబారాను తగ్గించాలి. పెద్ద పెద్ద కాన్వాయ్ వాహనాల్లో వెళ్లటం అందరికీ చాలా పెద్ద ఫ్యాషన్‌గా మారింది. కాన్వాయ్ వాహనాల సంఖ్య తగ్గించి ప్రజా ప్రతినిధులు ఆదర్శంగా నిలవాలి. సెక్యూరిటీని కూడా కుదించుకోవాలి. మిగతా 2లో...

### సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణపై యాక్షన్ ప్లాన్

- గోల్డెన్ అవర్ ఫండ్ రికవరీపై దృష్టి
- మ్యూల్ అకౌంట్ హంటర్ ఏఐ లాంటి టూల్స్ వినియోగం
- ఆధార్ సహా బయోమెట్రిక్స్ ద్వారా సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు

2

### సామర్థ్యం పెంపుతోనే పటిష్ట ఆర్థిక వ్యవస్థ

- ప్రతీ నెలా గణాంకాల సేకరణ-పక్కాగా అంచనాలు
- మండల స్థాయి వరకు ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు
- ప్రణాళిక శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

## ప్రధాని పొదుపు మంత్ర



- రెండు వాహనాల కాన్వాయ్‌తోనే మోదీ ప్రయాణం

**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధాని నరేంద్ర మోదీ కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్య భారీగా తగ్గింది. రెండు వాహనాల కాన్వాయ్‌తోనే ఆయన ప్రయాణించారు. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా ఈ మేరకు మార్పులు చేశారు. పశ్చిమాసియాలో సంక్షోభం నేపథ్యంలో దేశ ప్రజలకు పొదుపు మంత్రం పాటించాలని సూచించిన ప్రధాని మోదీ.. స్వయంగా వాటిని పాటిస్తున్నారు. ఈక్రమంలోనే తన అధికారిక కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించారు.

సాధారణంగా, ప్రధాని కాన్వాయ్‌లో మెర్సిడెస్ అల్ట్రా లగ్జరీ కారు, రేంజ్ రోవర్లు, టయోటా ఫార్చ్యూనర్లు, ఎస్కార్ట్ వాహనాలు, జామర్ యూనిట్లు సహా కనీసం 12-15 వాహనాలు ఉంటాయి. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా తన అధికారిక కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని మోదీ ఆదేశించినట్లు ఉదయం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ అధికారులు వెల్లడించారు. ప్రొటోకాల్ ప్రకారం ఆయన వెళ్లే దారుల్లో తప్పనిసరి భద్రతా ఏర్పాట్లు కొనసాగిస్తామన్నారు. మిగతా 2లో...

## తప్పనిసరి టెట్‌పై ఉత్కంఠ



- సుప్రీంకోర్టులో కీలక విచారణ
- సమీక్షా పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

వివరాలు 2



## అసెంబ్లీలో విజయ్ 'విక్టరీ'

- 144 ఓట్లతో నెగ్గిన టీవీకే ప్రభుత్వం
- బలపరీక్షలో నెగ్గిన విజయ్ సర్కార్!
- మద్దతుగా నిలిచిన కాంగ్రెస్, వీసీకే

3 లో

**తమిళనాడు (జర్నలిస్ట్ ఫైల్) :** తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా ఎన్నికైన టీవీకే అధినేత విజయ్ శాసనసభలోనూ తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో విజయ్ ప్రభుత్వం స్పష్టమైన మెజార్టీతో నెగ్గింది. బలపరీక్షకు సంబంధించి ఈ ఉదయం విజయ్ సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై చర్చ చేపట్టిన అనంతరం స్పీకర్ ఓటింగ్ నిర్వహించారు.

## ఏపీలో నెట్‌వర్క్ విప్లవం



- కేంద్ర "డిజిటల్ భారత్ నిధి" పథకం కింద 5జీ నెట్‌వర్క్ విస్తరణ..
- ఏజెన్సీ ప్రాంతాల్లో సైతం 5జీ సేవలు
- బీజేపీ ఏపి రాష్ట్ర అధ్యక్షులు పీవీయన్ మాధవ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం డిజిటల్ రంగంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీయన్ మాధవ్ పేర్కొన్నారు.

దేశంలో 5జీ నెట్‌వర్క్ విస్తరణలో భాగంగా కేంద్ర ప్రభుత్వ "డిజిటల్ భారత్ నిధి" పథకం కింద రాష్ట్రంలో 707 చోట్ల నూతన సెల్ టవర్ల ఏర్పాటు కు రంగం సిద్ధం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు సైతం 5జీ నెట్‌వర్క్ అందుబాటులోకి రానుందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలు, అధిక రద్దీ నగరాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు.

ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న 1668 నెట్‌వర్క్ టవర్లకు అదనంగా కొత్త టవర్లు చేరడంతో మొత్తం సంఖ్య 2375కు పెరగనుందని వెల్లడించారు. "డిజిటల్ భారత్ నిధి" పథకం కింద కొత్త సెల్ టవర్ల కోసం అవసరమైన స్థలాలను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చనుండగా, నిర్మాణ ఖర్చును కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని తెలియజేశారు.

ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, మిగతా 2లో...

## సెర్ప్‌లో సంస్కరణలపై సమీక్ష



- మహిళ పారిశ్రామికవేత్తల ప్రోత్సాహానికి పలు అంశాలపై చర్చ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేసే క్రమంలో ఎప్పటికప్పుడు వారికి కావాల్సిన సహాయ సహకారాలు అందించడంతో పాటు సమన్వయం చేసుకోవాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, మిగతా 2లో...

## హిందూయిజం ఒక జీవన విధానం



- విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి గుడికి వెళ్లడం తప్పనిసరేం కాదు : సుప్రీంకోర్టు

**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** హిందూయిజం అనేది జీవన విధానమని, ఈ విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి గుడికి వెళ్లడం లేదా పూజలు చేయడం తప్పనిసరేం కాదని తొమ్మిది మంది న్యాయమూర్తుల సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. మిగతా 3లో...


## తిరుపతి, విశాఖపట్నంలు 'ఐకానిక్ టూరిజం హబ్స్'గా అభివృద్ధి



**తిరుమల(జర్నలిస్ట్ ఫైల్) :** తిరుపతిని ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక,పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ అన్నారు. భక్తులకు కేవలం దర్శనమే కాకుండా, ఆధ్యాత్మిక అనుభూతిని పెంపొందించేలా ఎకో మరియు అడ్వెంచర్ టూరిజం అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నామన్నారు. బుధవారం ఉదయం మంత్రి దుర్గేష్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. నిడదవోలు నియోజకవర్గ నేతలతో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్న మంత్రి దుర్గేష్ కి టీటీడీ అధికారులు ఘనస్వాగతం పలికారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడిన మంత్రి దుర్గేష్ "తెల్లవారుజామునే ఆ శ్రీనివాసుని దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకోవడం జన్మధన్యంగా భావిస్తున్నాను. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంపై స్వామివారి ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుకున్నాను" అన్నారు. మిగతా 3లో...

## రొయ్యల ఫీడ్ ధరల పెంపు నిలిపివేత..



- మంత్రి అచ్చెన్నాయుడు జోక్యంతో కీలక నిర్ణయం
- రైతుల కష్టాలపై వ్యాపారం చేయొద్దు : ఫీడ్ కంపెనీలకు మంత్రి గట్టి హెచ్చరిక
- ఏకపక్ష ధరల పెంపు అంగీకరించం
- రైతుల ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

3 లో

# ప్రధాని పొదుపు మంత్ర

(మొదటి పేజీ తరువాయి)

**కాన్వాయ్ సైజును కుదించుకున్న కేంద్రమంత్రులు :** ఇంధన పొదుపుపై ప్రధాని మోదీ పిలుపు మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సహా పలువురు మంత్రులు తమ కాన్వాయ్ సైజును రెండు వాహనాలకు కుదించుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ సైతం కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించుకున్నట్లు వెల్లడించారు.

# తప్పనిసరి టెట్‌పై ఉత్కంఠ



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** తప్పనిసరి టెట్ ఉత్తర్వుకు వ్యతిరేకంగా దాఖలైన సమీక్షా పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం కీలక విచారణ నిర్వహించింది. దాదాపు రెండు గంటల పాటు సాగిన విచారణలో ఉపాధ్యాయుల తరఫున ప్రముఖ సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, అభిషేక్ మను సింఘ్వీ తదితరులు వాదనలు వినిపించారు.

2010కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నిబంధనను వర్తింపజేయడం అన్యాయమని న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా విద్యా హక్కు చట్టం, 2017 ఆర్‌టీఈ సవరణ చట్టం, ఎన్‌సీటీఈ మార్గదర్శకాలు, అలాగే 2012లో సవరించిన ఎన్‌సీటీఈ నిబంధనలను సవివరంగా ప్రస్తావించారు.

విచారణ సందర్భంగా అన్ని అంశాలను గౌరవ సుప్రీంకోర్టు ధర్మాసనం పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. టెట్ అర్హత సాధన గడువును ప్రస్తుతం ఉన్న రెండు సంవత్సరాల నుంచి నాలుగు సంవత్సరాలకు పొడిగించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కోర్టును అభ్యర్థించింది.

ఈ విచారణలో ఏఐపీటీఎఫ్ బృందం మొత్తం ఉపాధ్యాయుల తరఫున బలమైన వాదనలు వినిపించిందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 25 లక్షల మంది ఉపాధ్యాయులకు సుప్రీంకోర్టు న్యాయం చేస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఈ మేరకు ఏఐపీటీఎఫ్ జాతీయ అధ్యక్షుడు బసవరాజ గురికర్, సెక్రటరీ జనరల్ కమల్ కాంత్ త్రిపాఠీ, కార్యనిర్వాహక కార్యదర్శి ఏజీఎస్ గణపతిరావు సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

# సెర్ప్‌లో సంస్కరణలపై సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)



గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మంత్రి విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో సెర్ప్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలోనే పలు అంశాలపై మంత్రి చర్చించడంతో పాటు సూచనలు కూడా చేశారు. సెర్ప్‌లోని అన్ని స్థాయిల సిబ్బంది ఖా×ం – కీలక పనితీరు సూచికలు ఖరారు చేయడం.. చేతివృత్తులు, కులవృత్తుల వారికి నైపుణ్యం మెరుగుపరుచుకునేలా శిక్షణ యూనిట్ల ఏర్పాటు, తొలి విడతలో 3- 4 జిల్లాల్లో పైలెట్ పద్ధతిలో ఈ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. పాడి పరిశ్రమ ప్రధాన జీవనోపాధిగా ఉన్న అన్ని గ్రామాల్లో పశుగ్రాసం పెంపకం ప్లాట్లను అభివృద్ధి చేయడంతో పాటు ఐదు కంటే ఎక్కువ పాడి పశువులు ఉన్న స్వయం సహాయక సంఘాల (ాఎ+) మహిళలను గుర్తించి.. పాల సేకరణ, బాట్లింగ్, సొంత బ్రాండ్ మార్కెటింగ్‌పై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఇళ్ల వద్ద పెరటి కోళ్ల పెంపకం కోసం మదర్ హేచరీల ఏర్పాటుకు ప్రోత్సాహకాలపై చర్చించారు. ఎంపిక చేసిన మండలాల్లో పొట్టేళ్ల పెంపకం యూనిట్లను ప్రోత్సహించడం, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (ావీజీజీదీ) మరియు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (ామీదీ) కింద మహిళా సంఘాల సభ్యులందరినీ సంతృప్త స్థాయిలో నమోదు చేయడం, - బ్యాంకుల నుంచి డేటాను సేకరించి సెర్ప్ పోర్టల్‌లో అప్‌డేట్ చేయడం, నమోదు, క్లెయిమ్‌ల పరిష్కార పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటుపై చర్చించారు. పీఎం సూర్య ఘర్ యోజన కింద సోలార్ పవర్ యూనిట్ల ఏర్పాటుకు మహిళలకు సహకారం అందించడంతో పాటు మండల సమాఖ్యలు లేదా గ్రామ సంఘాల ద్వారా విద్యుత్ వాహనాల చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రోత్సహించాలని కూడా నిర్ణయించారు. ఈ సమావేశంలో సెర్ప్ అడిషనల్ సీఈవో శ్రీరామ్ నాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# "మేడ్ ఇన్ ఆంధ్ర - మేడ్ ఫర్ ఇండియా - మేడ్ ఫర్ ది వరల్డ్" ఇదే మన లక్ష్యం!

(మొదటి పేజీ తరువాయి)



ఇప్పటివరకు 800 కీలక ప్రాజెక్టులకు సంబంధించి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 24 లక్షల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు కుదిరాయి. గూగుల్ రూ.1.35 లక్షల కోట్లు, ఆర్సెలార్ మిట్టల్ రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడులతో ముందుకొచ్చాయి. వాటికి శంకుస్థాపనలు జరిగాయి. రాయల్ ఎన్ఫీల్డ్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి కంపెనీలు రాష్ట్రానికి వస్తున్నాయి. రాయలసీమలోని పుట్టపర్తిలో ఫైటర్ జెట్ తయారీ కేంద్రం 'ావీజాూ' ప్రాజెక్టు కూడా ఏపీలో ఏర్పాటు కానుంది" అని వెల్లడించారు.

**గూగుల్ వల్లే క్యారియర్ ఏపీకి వచ్చింది - ఇదే మల్టిప్లయర్ ఎఫెక్ట్ :** "ప్రతి పెట్టుబడి వెనుక ఒక ప్రత్యేక కథ ఉంటుంది. డేటా సెంటర్లు వస్తే ఉద్యోగాలు ఎలా వస్తాయని చాలా మంది నన్ను ప్రశ్నించారు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా డేటా సెంటర్లు ఏర్పాటుకు విశాఖ నగరానికి అనేక కంపెనీలు క్యూ కట్టాయి. ఇప్పటికే గూగుల్ కంపెనీ శంకుస్థాపన జరగగా, మరికొద్ది రోజుల్లో ఇంకో సంస్థ భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రానుంది. దానికి కూడా మంత్రివర్గం త్వరలో ఆమోదం తెలపనుంది. డేటా సెంటర్ ఎంత ముఖ్యమో, డేటా సెంటర్‌కు కావాల్సిన ఎకోసిస్టమ్ కూడా అంతే ముఖ్యం. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కావడంతోనే రాయలసీమకు క్యారియర్ కంపెనీ వచ్చింది. గూగుల్ డేటా సెంటర్ నిర్వహణకు భారీ స్థాయిలో కూలింగ్ సిస్టమ్స్ అవసరం అవుతాయి. ఆ అవసరాన్ని తీర్చేందుకు క్యారియర్ కంపెనీ శ్రీసిటీలో పెట్టుబడులు పెడుతోంది. దీనినే మల్టిప్లయర్ ఎఫెక్ట్ అంటారు. ఒక పెద్ద పెట్టుబడి వస్తే, దాని చుట్టూ అనేక అనుబంధ పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి." అని వివరించారు.

**క్లస్టర్ మోడల్‌తో అభివృద్ధి వికేంద్రీకరణ :** "మొదటిసారిగా మేము ఎమ్మెల్యేలు, ఎంపీలు అయినా ఆంధ్రప్రదేశ్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని కలిసికట్టుగా పని చేస్తున్నాం. 'ఒకే రాజధాని -- అభివృద్ధి వికేంద్రీకరణ' ప్రభుత్వ లక్ష్యం. మన ఎకానమీ 200 బిలియన్ డాలర్లుగా ఉండగా, 2047 కల్లా 2.4 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలని ప్రయత్నిస్తున్నాం. దాని కోసం క్లస్టర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 22 క్లస్టర్ల అభివృద్ధి ప్రణాళిక రూపొందించాం.

రాయలసీమలో ఆటోమొబైల్, రెన్యూవబుల్ ఎనర్జీ, హార్టికల్చర్ కోస్తాంధ్రలో సీబీజీ ప్లాంట్లు, ఆక్వా, అమరావతిలో క్వాంటం టెక్నాలజీ ఉత్తరాంధ్రలో ఫార్మా, డేటా సెంటర్లు, మెడికల్ ఎక్విప్‌మెంట్, ఐటీ రంగాల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేస్తున్నాం" అని పేర్కొన్నారు.

**20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్య సాధనలో ఎంఎస్ఎంఈలు కీలకం :** "మాకు గూగుల్ ఎంత ముఖ్యమో, రూ.50 లక్షలతో ప్రారంభమయ్యే ఎంఎస్ఎంఈ కూడా అంతే ముఖ్యం. ఆర్సెలార్ మిట్టల్ ఎంత ముఖ్యమో, కోటి రూపాయలతో ప్రారంభమయ్యే చిన్న సంస్థ కూడా అంతే ముఖ్యం. 20 లక్షల ఉద్యోగాల లక్ష్యం సాధించాలంటే ఎంఎస్ఎంఈల పాత్ర కీలకం. ఎంఎస్ఎంఈలు ఎదుర్కొనే సమస్యలు ప్రభుత్వానికి తెలుసు. అందుకే 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వైపు అడుగులు వేస్తున్నాం. ప్రతి ఎంఎస్ఎంఈకి అనుమతుల నుంచి రాయితీల వరకు అన్ని ప్రక్రియలను సరళీకృతం చేస్తున్నాం. ఎంట్రప్రెన్యూర్లు ఎక్కడికీ వెళ్లకుండా అన్ని అనుమతులు ఆన్‌లైన్‌లోనే ఇచ్చేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలు 20 లక్షలకు పైగా ఉన్నాయి. వాటన్నింటినీ ప్రోత్సహించే బాధ్యత ఎంఎస్ఎంఈ శాఖ మంత్రిదే. ఇది సాధ్యం కావాలంటే ఒక వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు కావాలి. ఎంఎస్ఎంఈలు అభివృద్ధి చెందితే ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. వాటి ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. అదే ప్రభుత్వ లక్ష్యం" అని తెలిపారు.

**మూడు నెలల్లో 100 కంపెనీలు ఎన్ఎస్ఈలో లిస్ట్ అవ్వాలి:** "ఎన్ఎస్ఈ ద్వారా చిన్న కంపెనీలు పెద్ద సంస్థలుగా ఎదిగే అవకాశం ఉంది. ఇప్పటివరకు చీూజులో 723 కంపెనీలు లిస్టై రూ.22,415 కోట్ల నిధులు సమీకరించాయి. అందులో 158 సంస్థలు మెయిన్ బోర్డుకు చేరాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటివరకు కేవలం మూడు సంస్థలు మాత్రమే చీూజులో లిస్ట్ అయి రూ.100 కోట్ల నిధులు సమీకరించాయి. వచ్చే మూడు నెలల్లో కనీసం 100 కంపెనీలు చీూజులో లిస్ట్ అవ్వాలనే లక్ష్యంతో ఎంఎస్ఎంఈ శాఖ పనిచేయాలి" అని సూచించారు.

**దేశం చూపు..మన వైపు :** ఔత్సాహికవేత్తల్లో పోటీతత్వం.. పట్టుదల ఉండాలి. మన దేశంలో వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం మన రాష్ట్రానికి రావడం గర్వకారణం. పారిశ్రామికవేత్తలకు ఏ కష్టం వచ్చినా ఒక మెసేజ్ దూరంలో నేను ఉంటా. ఆంధ్రప్రదేశ్‌లోని చిన్న కంపెనీలు ప్రపంచ స్థాయి పెద్ద సంస్థలుగా ఎదగాలి. మరిన్ని ఉద్యోగాలు, మరింతమంది పారిశ్రామికవేత్తలు, మరిన్ని విజయగాథలు సృష్టిద్దాం" అని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు చీూజు సీఈఓ, ఎండీ ఆశిష్ కుమార్ చౌహాన్, ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయులు, కేశినేని శివనాథ్ (చిన్ని), ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈఓ ఎం. విశ్వ, ఇండోరెంట్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆల్టర్నేట్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్, స్టీల్ సిటీ సెక్యూరిటీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పొదుపు మంత్రంతోనే ఆర్థిక స్థిరత్వం





(మొదటి పేజీ తరువాయి)

విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలన్న ప్రధాని సూచనలను పాటిద్దాం. బంగారం కొనడాన్ని కూడా తగ్గించాలని ప్రధాని చెప్పారు. దీనిపైనా ప్రజలు ఆలోచన చేయాలి. మన దేశంలో, రాష్ట్రంలోనూ మంచి పర్యాటక ప్రాంతాలున్నాయి. ప్రజలు విదేశాలకు వెళ్లడం కంటే స్వదేశంలో పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలి. సెలవు వస్తే విదేశాలకు వెళ్తున్నారు. అంతకంటే మంచి ప్రదేశాలు మన దేశంలో ఉన్నాయి. మన రాష్ట్రంలో అరకు, పాపికొండలు, గండికోట వంటి ప్రదేశాలు ఉన్నాయి. గోవాను మించిన టూరిజం కేంద్రంగా సూర్యలంక మారుతుంది. నాదేశం-నా బాధ్యత అనే ఆలోచన ప్రజలంతా చేయాలి'. అని సీఎం సూచించారు.

**విద్య, వైద్యంలో తిరుగులేని స్థానం :** పరిశ్రమలకు, సంస్థల ఏర్పాటుకు అనుమతులన్నీ ఆటోపైలట్ మోడ్‌లో ఇచ్చే బాధ్యత తమదని, నిర్మాణాలు పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభించే బాధ్యత పారిశ్రామిక వేత్తలదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విద్య, వైద్యంలో ఆంధ్రప్రదేశ్ తిరుగులేని స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. ప్రపంచంలోని ప్రతీ ముగ్గురు డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బందిలో ఒకరు అమరావతి నుంచే తయారుకావాలన్నారు. అమరావతిలోని నిడమర్రులో బొల్లినేని ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ శంకుస్థాపన అనంతరం ప్రసంగించారు.

**వచ్చే ఏడాది ఇదే రోజున ప్రారంభం కావాలి :** సంస్థలకు శంకుస్థాపనలతో పాటు వేగంగానూ ప్రారంభోత్సవాలు కావాలి. 2027లో ఇదే రోజున అమరావతిలో కిమ్స్ ఆస్పత్రి ప్రారంభం కావాలి. ప్రజలకు సేవ చేసేందుకు భాస్కరరావు కిమ్స్ ఏర్పాటు చేశారు. చిన్న స్థాయిలో ప్రారంభమైన కిమ్స్ ఆస్పత్రి ఇప్పుడు విస్తరించి 30 వేల కోట్ల ఆస్తిగా మారింది. ఎంట్రప్రెన్యూర్‌గా మారితేనే దేశానికి, రాష్ట్రానికి సంపద సృష్టికి అవకాశం ఉంటుంది. అమరావతి అభివృద్ధి కావాలంటే చాలా మంది పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలి. గతంలో హైదరాబాద్‌లో చాలా తక్కువ ఆస్పత్రులు హోటళ్లు మాత్రమే ఉండేవి. సీఐఐ సదస్సులు పెట్టేందుకు కనీసం కన్వెన్షన్ సెంటర్లు కూడా ఉండేవి కావు. నాడు తీసుకున్న అభివృద్ధి చర్యలతో ఇప్పుడు దేశానికే మెడికల్ హబ్‌గా హైదరాబాద్ తయారైంది.

**యువతకు లక్ష ఉద్యోగాల కల్పన :** 'అమరావతి అభివృద్ధిలో భాగస్వామి అయ్యేందుకు ముందుకొచ్చిన బైసర్‌ను, కిమ్స్ ఎండీ డాక్టర్ భాస్కర్‌రావును అభినందిస్తున్నాను. విద్య, వైద్యంలో తిరుగులేని స్థాయిలో ఉండేలా 25 కిమ్స్ ఏర్పాటువుతోంది. మెడికల్ కాలేజీ, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి లక్ష మందికి నైపుణ్యం అందించేలా సంస్థ ఎదగనుంది. 500 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం జరుగుతోంది. 250 మెడికల్ సీట్లు, 1,000 నాన్ మెడికల్ సీట్లు, మరో 1,000 మంది ట్రైనీలు తయారుకావాలి. డెంటల్, ఫిజియో థెరపీ వంటి సుమారు 5,000 మందిని నియమించుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా వైద్యులతో పాటు నర్సులు, పారామెడికల్ సిబ్బంది టెక్నీషియన్లు చాలా అవసరం ఉంది. డాక్టర్లు కూడా ఏఐ నేర్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది'. అని సీఎం చంద్రబాబు అన్నారు.

**23 నెలల క్రితం రాష్ట్రంలో విధ్వంసం :** గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. అలాంటి అరాచక పాలన నా జీవితంలో చూడలేదు. నేను పిల్లల భవిష్యత్ మాత్రమే చూస్తాను. యువతకు ఉద్యోగాలు ఇవ్వాలనేది నా ఆలోచన. ఇటీవలే గూగుల్ డేటా సెంటర్‌కు భూమి పూజ చేసుకున్నాం. 2028 ఆగస్ట్ కి ముందే నిర్మాణం పూర్తి చేసి ఆపరేషన్ ప్రారంభించాలని సూచించాను. ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్ కూడా శంకుస్థాపన చేశాం. 2028 డిసెంబర్‌కు ఫేజ్ 1 సిద్ధం అవుతుంది.


**దేశంలోనే తొలి క్వాంటమ్ హబ్‌గా ఏపీ :** అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ రాబోతోంది. ఐబీఎమ్, టీసీఎస్, ఎల్ అండ్ టీ పనులు ప్రారంభించాయి. డిసెంబర్ నాటికి మన దేశంలో మొదటి క్వాంటమ్ కంప్యూటర్‌కి చిరునామాగా ఏపీ తయారవుతుంది. రెండేళ్లలో ప్రపంచానికి క్వాంటమ్ కంప్యూటర్లు మన అమరావతి నుంచి సరఫరా చేస్తాం. ఇప్పటికే ఓ క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీ అమరావతిలో ఏర్పాటయ్యింది. త్వరలో 133 క్యూబిట్ సామర్థ్యంతో క్వాంటం కంప్యూటర్ సిద్ధం అవుతుంది. ఇరాన్-అమెరికా యుద్ధంతో మన దేశంలో అనేక సమస్యలు వచ్చాయి. పెట్రోలు, గ్యాస్, డీజిల్ కొరత ఏర్పడింది. ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అయ్యే పరిస్థితి వచ్చింది. విదేశాలపై ఆధార పడకుండా గ్రీన్ ఎనర్జీని ఇక్కడే ఉత్పత్తి చేసుకునేలా కార్యాచరణ చేపట్టాం. ప్రతీ పొలంలో, ప్రతీ ఇంటి పైనా సోలార్ రూఫ్ టాప్ లాంటి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలి. గత పాలకులు ప్రజలపై 32 వేల కోట్ల విద్యుత్ భారం వేశారు. ఇప్పుడు విద్యుత్ కొనుగోలు వ్యయం తగ్గించాం. గత ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచితే మన ప్రజా ప్రభుత్వంలో చార్జీలు పెంచలేదు. భవిష్యత్‌లో పెంచబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

**ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి :** 'ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. రాష్ట్ర బడ్జెట్‌లో వైద్యారోగ్య శాఖకు రూ.20 వేల కోట్లు కేటాయించాం. చాలా దేశాల్లో వృద్ధాప్య సమస్య ఉంది. వైద్యుల కంటే నర్సులకు, పారామెడికల్ సిబ్బందికి డిమాండ్ ఉంది. ఈ రంగంలో నైపుణ్యాలు పెంచుకోవాలి. ఏ దేశంలో ఎక్కువ డిమాండ్ ఉంటుందో అక్కడికి వెళ్లి సేవలు అందించేలా ఆయా దేశాల భాషను నేర్చుకోవాలని కోరుతున్నాను. బైసర్ సంస్థ దృష్టి పేరిట ఏఐ ఆధారిత కంటి అద్దాలు అందించారు. తద్వారా దృష్టి లోపం ఉన్న అంధులు సొంతంగా పనిచేసుకునే అవకాశం వస్తుంది. ప్రజల ఆరోగ్య బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. సంజీవని ద్వారా డిజిటల్ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చాం. కిమ్స్ సంస్థ వైద్యంతో పాటు ప్రివెంటివ్ హెల్త్ కేర్ అందించేలా చర్యలు చేపట్టాలి. అమరావతిలో వైద్య సేవల కోసం దేశ, విదేశాల నుంచి వచ్చే వారికి విమానాశ్రయం, హోటళ్లు లాంటి సదుపాయాలు ఉండాలి. ఒకప్పుడు శారీరక కష్టం ఎక్కువగా ఉండేది.

**విశ్వ నగరంగా అమరావతి :** రాష్ట్రం కోసం రాజధాని కోసం భూములిచ్చిన రైతుల భవిష్యత్‌కు అండగా ఉంటాం. రెండో దశలో భూసమీకరణ ద్వారా అమరావతిని భవిష్యత్ నగరంగా నిర్మిస్తాం. 190 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు వేస్తాం. వెస్ట్ బైపాస్ లాగే మరో 10 నుంచి 15 ఫ్లైఓవర్లు కృష్ణానదిపై రావాలి. రాబోయే 20 ఏళ్లలో ప్రపంచంలోనే మేటి నగరంగా అమరావతి తయారవుతుంది. అమరావతితో పాటు విశాఖను కూడా విశ్వనగరంగా అభివృద్ధి చేస్తున్నాం. రాయలసీమలో ఈ నెల 15 తేదీన డిఫెన్స్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్నాం. రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌గా, టెక్నాలజీ హబ్‌గా మారుతుంది. 23 నెలల్లో రూ.23 లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చాం. వీటి ద్వారా 24 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో పనిచేస్తున్నాం. లక్షమంది ఉద్యోగులను మెడికల్ ఫీల్డ్‌లో తయారు చేయగలిగితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

# సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణపై యాక్షన్ ప్లాన్

- గోల్డెన్ అవర్ ఫండ్ రికవరీపై దృష్టి
- మ్యూల్ అకౌంట్ హంటర్ ఏఐ లాంటి టూల్స్ వినియోగం
- ఆధార్ సహా బయోమెట్రిక్స్ ద్వారా సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు
- సైబర్ మోసాలపై ప్రజల్లో నిరంతర అవగాహన కల్పించాలి
- సైబర్ నేరాల్లో తక్షణ స్పందన- నియంత్రణా వ్యవస్థపై సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ నేరాల ద్వారా బాధితుల సొమ్మును రాబట్టేందుకు గోల్డెన్ అవర్ ఫండ్ రికవరీ టెక్నాలజీలపై దృష్టి పెట్టాలని పోలీసు అధికారులు, బ్యాంకింగ్ అధికారులకు సూచనలు ఇచ్చారు. సచివాలయంలో బుధవారం సైబర్ నేరాల్లో తక్షణ స్పందన-ఏపీలో నియంత్రణా వ్యవస్థలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఆర్థిక నేరాలకు పాల్పడే సైబర్ నేరగాళ్లు ఇతరుల బ్యాంక్ ఖాతాలను వినియోగించకుండా చేపట్టే చర్యలు, గోల్డెన్ అవర్ ఫండ్ రికవరీ, ఏపీ సైబర్ పాలసీ తదితర అంశాలపై సమీక్షలో చర్చించారు. ఏపీలో సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలు జరగకుండా బ్యాంకులు తగిన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై రిజర్వు బ్యాంకును సంప్రదించాలని సీఎం సూచించారు. ఆర్థిక, సైబర్ నేరాల్లో ఇన్వెస్ట్ మెంట్ ఫ్రాడ్స్ పెద్ద ఎత్తున జరుగుతున్నాయనే అంశంపై సీఎం కొన్ని సూచనలు చేశారు. ఆధార్ ఆథంటికేషన్, కేవైసీ లాంటివి లేకుండా షెల్ కంపెనీలను కొందరు ప్రారంభిస్తున్నారని... ఇలాంటి ఘటనలపై అధ్యయనం చేయాలన్నారు. బ్యాంకర్లు, పోలీసు విభాగం, ఏపీటీఎస్, ఆర్థిక శాఖలు సమన్వయంతో ఆన్ లైన్ ఆర్థిక మోసాల విషయంలో ఓ నియామవళిని సిద్ధం చేయాలని సీఎం నిర్దేశించారు. అనుమానిత మ్యూల్ బ్యాంకు ఖాతాలను ఫ్లాగ్ చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ సైబర్, ఆర్థిక నేరాల్లో ఖాతాదారుల ప్రయోజనాలు రక్షించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

**సైబర్ ఫ్రాడ్స్ నుంచి రక్షణకు టెక్నాలజీ టూల్స్ :** యూపీఐ పేమెంట్స్ ద్వారా మిలియన్ల సంఖ్యలో ఆర్థిక లావాదేవీలు క్షణాల్లో జరుగుతున్నాయని ఈ నేపథ్యంలో గోల్డెన్ అవర్ ఫండ్ రికవరీ అంశంపై మరింతగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ అంశంపై మరిన్ని సాంకేతికపరమైన నూతన ఆవిష్కరణలు రావాల్సి ఉందని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. సైబర్ నేరాల నియంత్రణలో ఏపీటీఎస్ ముఖ్య భూమిక పోషించాలని... జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో టెక్నాలజీలను అధ్యయనం చేయాలని సూచించారు. అన్ని బ్యాంకులు వారాంతాల్లో పెద్ద మొత్తంలో జరిగే ఆర్థిక లావాదేవీలపై దృష్టి పెట్టాలన్నారు. కొన్ని నిబంధనల్ని మార్చుకునే విషయంలో రిజర్వు బ్యాంకును సంప్రదించాలని అన్నారు. రిజర్వు బ్యాంకు తీసుకువచ్చిన మ్యూల్ అకౌంట్ హంటర్ ఏఐ లాంటి టూల్స్ ను నకిలీ ఖాతాలను గుర్తించేందుకు వినియోగించాలన్నారు. హర్యాణా, మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాల్లో ఉత్తమ విధానాల్ని అధ్యయనం చేసి ఓ నిర్దుష్టమైన కార్యాచరణ సిద్ధంచేయాలన్నారు. దీంతో పాటు సైబర్, ఆన్ లైన్ ఆర్థిక మోసాలపై ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ఏపీ సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్ ద్వారా ప్రభుత్వ వెబ్ సైట్లకు రక్షణ :** ఏపీలో సైబర్, ఆర్థిక నేరాలకు సంబంధించి 9.29 లక్షల కాల్స్ బాధితుల నుంచి 1930 టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదులు వచ్చినట్టు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వివరించారు. సైబర్, ఆర్థిక నేరాల బారిన పడి ఏపీలో ఇప్పటి వరకూ రూ.652 కోట్లను బాధితులు కోల్పోయినట్టు తెలిపారు. సీఐడీ సైబర్ క్రైమ్ విభాగం-బ్యాంకర్లతో కలిసి రూ.116 కోట్ల పైచిలుకు మొత్తాన్ని సైబర్ నేరగాళ్లకు చేరకుండా కాపాడగలిగామని స్పష్టం చేశారు. పిషింగ్, విషింగ్, క్రెడిట్, డెబిట్ కార్డు మోసాలు, ఆన్‌లైన్ లోన్ ఫ్రాడ్స్ సహా డిజిటల్ అరెస్టుల్లో బాధితులు సొమ్మును కోల్పోతున్నట్టు అధికారులు తెలిపారు. సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణ కోసం రాష్ట్ర స్థాయిలో సీఐడీ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ పని చేస్తోందని.. విజయవాడ, విశాఖ, తిరుపతిలలో సైబర్ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రికి వివరించారు. మరోవైపు ఏపీలో సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్ ద్వారా డేటాకు రక్షణ కల్పిస్తున్నామని ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సీఎంకు వివరించారు. ఈ సమీక్షకు మంత్రి పయ్యావుల కేశవ్, హోం మంత్రి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఏపీ ఫోరెన్సిక్స్ సలహాదారు కేపీసీ గాంధీ, రిజర్వు బ్యాంకు సహా వివిధ బ్యాంకుల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# సామర్థ్యం పెంపుతోనే పటిష్ఠ ఆర్థిక వ్యవస్థ

- ప్రతీ నెలా గణాంకాల సేకరణ-పక్కాగా అంచనాలు
- మండల స్థాయి వరకు ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు
- ప్రణాళిక శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రాన్ని ఆర్థికంగా మరింత పటిష్ట పరిచేందుకు వ్యవస్థలో సామర్థ్య పెంపు జరగాలని, ఇందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. 15 శాతం వృద్ధి సాధించడం ద్వారా స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలను చేరుకోగల 93వఏ్యని, ఇందుకు వేగంగా గణాంకాలను సేకరించాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు సిబ్బందికి 3 నెలల పాటు శిక్షణ ఇవ్వాలని సీఎం ఆదేశించారు. జీఎస్డీపీ అంచనాలను సంప్రదాయ విధానంలో కాకుండా రియల్‌టైమ్ మానిటరింగ్ ద్వారా రూపొందించేలా శిక్షణ అందించాలన్నారు. సచివాలయంలో బుధవారం ప్రణాళిక శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... త్వరలోనే పూర్తి స్థాయిలో డేటా డ్రివెన్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుడతామన్నారు. సమీక్షలో జీఎస్డీపీ కెపాసిటీ బిల్డింగ్, ఏఐ ఆధారిత ఆర్థిక విశ్లేషణ, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ప్రధాన సర్వేలు, జిల్లా-మండల స్థాయి అధికారులకు శిక్షణ, కేపీఐల ఆడిటింగ్ అనుసంధానం వంటి అంశాలపై అధికారులతో సీఎం చర్చించారు.

**ఏఐ ఆధారిత ఆర్థిక విశ్లేషణ :** ప్రస్తుతం రాష్ట్ర జీఎస్డీపీ అంచనాలు మూడు నెలలకు, ఏడాది కాలానికి రూపొందిస్తున్నారని, దీంతో ఆర్థిక స్థితిగతులపై తక్షణ అవగాహన సాధ్యం కావడం లేదని సీఎం అభిప్రాయపడ్డారు. చారిత్రక డేటాపై ఎక్కువ ఆధారపడటం వల్ల విధాన నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం జరుగుతోందని చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక వృద్ధిని ప్రతీ నెలా... ప్రతీ జిల్లాలో, ప్రతీ మండలంలో ట్రాక్ చేయగలిగేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని సీఎం స్పష్టం చేశారు. ఇందుకోసం జీఎస్డీపీ విధానాన్ని అర్థం చేసుకునేలా, అంచనాలు వేగంగా రూపొందించేలా అధికారులకు, ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలన్నారు. మొత్తం 5 జోన్లు, 28 జిల్లాలు, 175 నియోజకవర్గాలను కవర్ చేస్తూ మూడు నెలల పాటు కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లు, జోనల్-జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమాలు, నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్ల తయారీపై దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి ముగ్గురు అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. మరోవైపు వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాల్లో ఏఐ ఆధారిత ఆర్థిక విశ్లేషణ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నట్టు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ప్రస్తుతం ట్రాక్ చేయని సూచికలను గుర్తించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు.



## ఏపీలో నెట్‌వర్క్ విప్లవం

(మొదటి పేజీ తరువాయి)

అల్లూరి సీతారామరాజు జిల్లాలో 101, పార్వతీపురం మన్యం జిల్లాలో 78 కొత్త టవర్ల ఏర్పాటు చేయాలని నిర్ణయించారని తెలిపారు. రెవెన్యూ, అటవీ శాఖల అనుమతుల్లో కొంత జాప్యం ఉన్నప్పటికీ, నెట్‌వర్క్ సేవలను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

గత కొన్ని సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న దూరదృష్టి నిర్ణయాల వల్ల డిజిటల్ ఇండియా కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరించిందని ఆయన అన్నారు. యూపీఐ చెల్లింపులు, డిజిటల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ ప్రభుత్వ సేవలు, ఆధార్ ఆధారిత సేవలు ప్రజల జీవితాలను సులభతరం చేశాయని తెలిపారు.

భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ లావాదేవీలు జరుగుతున్న దేశంగా ఎదగడం ప్రధాని మోదీ సమర్థ నాయకత్వానికి నిదర్శనమని ఆయన కొనియాడారు. డిజిటల్ సాంకేతికత ద్వారా పారదర్శకత పెరిగి అవినీతి తగ్గిందని, సామాన్య ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా అందుతున్నాయని చెప్పారు.

యువత డిజిటల్ టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని స్టార్టప్‌లు, ఆవిష్కరణల ద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని పీవీయన్ మాధవ్ పిలుపునిచ్చారు.

## తిరుపతి, విశాఖపట్నంలు 'ఐకానిక్ టూరిజం హబ్స్'గా అభివృద్ధి



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వ ప్రణాళికలను వివరించారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం, తిరుపతిలో అధునాతన వసతులు, స్టార్ హోటళ్ల నిర్మాణానికి ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు.. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో తిరుపతి, విశాఖపట్నం నగరాలను అంతర్జాతీయ స్థాయి 'ఐకానిక్ టూరిజం హబ్స్'గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాయలసీమను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు నూతన పర్యాటక విధానం 2024-29ని అమలు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దీని ద్వారా ప్రైవేట్ ఇన్వెస్టర్లను ఆహ్వానిస్తున్నామని, ఇప్పటికే తిరుపతిలో సుమారు ఆరు 'స్టార్ హోటళ్ల' నిర్మాణానికి పీపీపీ విధానంలో ప్రతిపాదనలు వచ్చాయని వెల్లడించారు. తిరుపతికి వచ్చే భక్తులు కేవలం ఒక రోజుకే పరిమితం కాకుండా, 2-3 రోజుల పాటు ఇక్కడే బస చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇందుకోసం తిరుపతి పరిసర ప్రాంతాల్లో ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరమైన అనుభూతిని అందించడం కోసం ఎకో టూరిజం, సాహస క్రీడలు ఏర్పాటుచేస్తూ అడ్వెంచర్ టూరిజం వంటి వినూత్న అంశాలను అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటకులు ఇక్కడ ఎక్కువ కాలం గడిపేలా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తామని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను పర్యాటక స్వర్గధామంగా మారుస్తామని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

అంతకుముందు బాపట్ల పర్యటన ముగించుకుని తిరుపతి చేరుకున్న మంత్రి దుర్గేష్ కి కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా తిరుపతి రీజియన్‌లోని పర్యాటక ప్రాంతాల స్థితిగతులపై జిల్లా పర్యాటక శాఖ అధికారులతో నిర్వహించే సమీక్షా సమావేశంలో క్షేత్రస్థాయి అభివృద్ధిపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. అదే విధంగా హోటల్ రీజెంట్ దేవరాయ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఏపీని ప్రపంచ పర్యాటక మ్యాప్‌లో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## అసెంబ్లీలో విజయ్ 'విక్టరీ'

(మొదటి పేజీ తరువాయి)



ఇది ఆసక్తికరంగా సాగింది. సాధారణ ఓటింగ్ మాదిరిగా కాకుండా.. ఒక్కో సభ్యుడి పేరు పిలుస్తూ ఎమ్మెల్యేల సమ్మతిని సభాపతి నమోదు చేసుకున్నారు.

ఇందులో విజయ్ ప్రభుత్వానికి మద్దతుగా 144 మంది ఎమ్మెల్యేలు ఓటేశారు. 22 మంది సభ్యులు వ్యతిరేకించారు. బలపరీక్ష సమయంలో అసెంబ్లీ నుంచి డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. టీవీకే ప్రభుత్వానికి కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలు మద్దతిచ్చాయి. అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలు కూడా సీఎంకు అనుకూలంగా ఓటేశారు.

**అన్నాడీఎంకే జం అన్నాడీఎంకే :** అంతకుముందు చర్చ సందర్భంగా శాసనసభలో ఒకింత గందరగోళం నెలకొంది. అన్నాడీఎంకే అధినేత, మాజీ సీఎం పళనిసామి మాట్లాడుతూ.. విజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేలకు ఆయన డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించారు. బలపరీక్షకు ముందు తమ పార్టీ ఎమ్మెల్యేలను సీఎం కలవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అన్నాడీఎంకే పార్టీ ఐక్యంగానే ఉందని.. తమ ఎమ్మెల్యేలంతా విజయ్‌కు వ్యతిరేకంగా ఓటేస్తారని పళనిస్వామి తెలిపారు. అయితే, ఈ వ్యాఖ్యలను అన్నాడీఎంకే రెబల్ వర్గం ఎమ్మెల్యేలు ఖండించారు. తామంతా విజయ్‌కే మద్దతిస్తామని రెబల్ వర్గం నేత వేలుమణి స్పష్టంచేశారు.

**రీల్ ప్రభుత్వం: ఉదయనిధి స్టాలిన్ :** ఇక చర్చలో డీఎంకే ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ విజయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. "ఈ రాష్ట్రానికి రియల్ ప్రభుత్వం కావాలి. రీల్ ప్రభుత్వం కాదు. టీవీకే ప్రభుత్వానికి మెజార్టీ లేదు. మా కూటమిలోని పార్టీలు ఇప్పుడు మద్దతివ్వడం వల్లే విజయ్ గట్టెక్కగలుగుతున్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడ్డారు. దీనివల్ల రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోంది" అని ఉదయనిధి విమర్శించారు. అనంతరం బలపరీక్ష ఓటింగ్‌లో తాము పాల్గొనబోమంటూ సభ నుంచి డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు.

**హామీలన్నీ నెరవేరుస్తాం: విజయ్ :** చివర్లో విజయ్ మాట్లాడారు. తమ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిచ్చిన పార్టీలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. "మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఉంటుంది. లౌకిక విధానాన్ని అవలంబిస్తూ పాలన సాగిస్తాం. గత ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తాం. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. అందరికీ సామాజిక న్యాయాన్ని అందించే బాధ్యత మాది" అని విజయ్ పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ నియామకంపై వచ్చిన విమర్శలపై స్పందిస్తూ.. దాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారి (రాజకీయం)గా రిక్కిరాధన్ పండిట్ వెట్రివేల్‌ను నియమించడంపై పలు పార్టీల నుంచి వ్యతిరేకత ఎదురైంది.

234 శాసనసభ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ 108 స్థానాల్లో గెలుపొందింది. ఇందులో విజయ్ రెండుచోట్ల పోటీ చేశారు. డీఎంకే 59, అన్నాడీఎంకే 47 చోట్ల గెలుపొందింది. కాంగ్రెస్ 5, పీఎంకే 4, ఐయూఎంఎల్ 2, సీపీఐ 2, వీసీకే 2, సీపీఎం 2, భాజపా 1, డీఎండీకే 1, ఏఎంఎంకే 1 చోట విజయం సాధించాయి.

# హిందూయిజం ఒక జీవన విధానం

(మొదటి పేజీ తరువాయి)

హిందూయిజంపై విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి ఇంట్లో ఒక దీపాన్ని వెలిగించుకున్నా సరిపోతుందని తేల్చి చెప్పింది. కేరళలోని శబరిమల ఆలయం సహా పలు మతపరమైన ప్రదేశాల్లో మహిళలపై వివక్షకు సంబంధించిన పిటిషన్లతో పాటు దావూదీ బోహ్రాలతో సహా పలు మతాలు పాటించే మత స్వేచ్ఛ పరిధిపై విచారణ జరిపే క్రమంలో బుధవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్, జస్టిస్ ప్రసన్న బి వరాలే, జస్టిస్ ఆర్ మహదేవన్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి కూడా ఉన్నారు.

**శబరిమల ఆలయ ప్రవేశ తీర్పు - పునస్సమీక్ష పిటిషన్లపై విచారణ :** శబరిమల ఆలయ ప్రవేశ తీర్పును 2018 సెప్టెంబర్ 28న సుప్రీంకోర్టు ఇచ్చింది. అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. 10 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలను శబరిమల ఆలయంలోకి అనుమతించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని 4:1 మెజారిటీతో ఆనాడు సుప్రీంకోర్టు బెంచ్ తీర్పు ఇచ్చింది. 2018 నాటి ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పునస్సమీక్ష పిటిషన్లపై ప్రస్తుతం సుప్రీంకోర్టులో 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది. దీనిపై తమ వాదనలను కూడా వినాలంటూ పలువురు మధ్యంతర పిటిషన్లు దాఖలు చేశారు. ఈ విచారణలో భాగంగా 15వ రోజున (బుధవారం) మధ్యంతర పిటిషన్ దాఖలు చేసిన ఒక పక్షం తరఫున అడ్వకేట్ డాక్టర్ జి. మోహన్ గోపాల్ వాదనలు వినిపించారు.

**ఇప్పుడందరూ వేదాలను అంగీకరిస్తున్నారా?:** "హిందూ మతంలోని పలు వర్గాల నుంచే సామాజిక న్యాయం కోసం డిమాండ్ వస్తోంది. హిందూయిజాన్ని ఒక మత వర్గంగా నిర్వచించారు. మతం, తత్వశాస్త్రానికి సంబంధించిన అన్ని విషయాల్లో వేదాలను అత్యున్నత ప్రమాణంగా అంగీకరించేవాడే హిందువు అని 1966లో తీర్పు ఇచ్చారు. హిందువులందరి అభిప్రాయాలను తీసుకోకుండానే గతంలో కోర్టులు ఈవిధంగా ఒక నిర్ణయానికి వచ్చాయి. హిందువుల్లో ఎవ్వరూ ఎప్పుడూ అలా చెప్పలేదు. నాకు వేదాల పట్ల అత్యంత గౌరవం, గొప్ప ఆరాధనా భావం ఉన్నాయి. కానీ, నేడు హిందువులుగా వర్గీకరించిన ప్రతి ఒక్కరూ అన్ని ఆధ్యాత్మిక, తాత్విక విషయాల్లో వేదాలను అత్యున్నత ప్రమాణంగా అంగీకరిస్తున్నారు అన్నది వాస్తవమేనా?" అని మధ్యంతర పిటిషన్ దాఖలుచేసిన ఒక పక్షం తరఫున అడ్వకేట్ డాక్టర్ జి. మోహన్ గోపాల్ సుప్రీంకోర్టులో వాదన వినిపించారు.



**అందుకే హిందూ మతాన్ని జీవన విధానం అంటారు :** ఈ వాదనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న స్పందిస్తూ, "అందుకే హిందూ మతాన్ని ఒక జీవన విధానం అంటారు. ఒక హిందువు హిందువుగా ఉండటానికి తప్పనిసరిగా గుడికి వెళ్లడం గానీ, ఏదైనా ఆచారం పాటించడం గానీ అవసరం లేదు" అని ఆమె పేర్కొన్నారు. "ఆచారబద్ధంగా ఉండాల్సిన అవసరం లేదు. ప్రజలు తమ విశ్వాసాన్ని కలిగి ఉండటానికి ఎవరూ అడ్డు రాలేరు" అని జస్టిస్ నాగరత్న తెలిపారు. "ఒక వ్యక్తి హిందూ మత విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి, గుడిసెలో దీపాన్ని వెలిగించుకున్నా సరిపోతుంది" అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఈసందర్భంగా కీలక వ్యాఖ్య చేశారు.

# రొయ్యల ఫీడ్ ధరల పెంపు నిలిపివేత..




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆక్వా రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ నిర్ణయాన్నీ కూటమి ప్రభుత్వం సహించదని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రొయ్యల ఫీడ్ ధరలను ఒక్కసారిగా పెంచడం వల్ల రాష్ట్రంలోని వేలాది ఆక్వా రైతులపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులు, రైతు సంఘాలు, అధికారులతో బుధవారం మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా స్పందిస్తూ, రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా ధరలు పెంచడం సరైన విధానం కాదన్నారు. ప్రస్తుతం ఆక్వా రంగం ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటోందని, ఇలాంటి సమయంలో రైతులపై అదనపు భారం మోపే చర్యలు తీసుకుంటే ప్రభుత్వం ఊరుకోదని హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలు కాపాడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

మంత్రి ఆదేశాల నేపథ్యంలో ష్రిమ్ప్ ఫీడ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు స్పందిస్తూ, పెంచిన ఫీడ్ ధరల అమలును తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా తెలియజేశారు. ముడి పదార్థాల ధరలు నిరంతరం పెరుగుతున్న కారణంగా ఫీడ్ ధరల సవరణపై ఆలోచించాల్సి వచ్చిందని అసోసియేషన్ పేర్కొన్నప్పటికీ, మంత్రి అచ్చెన్నాయుడు సూచనలు, మార్గదర్శకాలను గౌరవిస్తూ ధరల పెంపును వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. రైతులు, ఫీడ్ తయారీ సంస్థలు, అధికారులు పాల్గొనే ఉమ్మడి సమావేశం ఈ నెల 15న నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అందరి అభిప్రాయాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుని రైతులకు నష్టం కలగకుండా, పరిశ్రమ కూడా కొనసాగగలిగే విధంగా పరస్పర ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆక్వా రంగాన్ని కాపాడేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని, రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఏపీఎస్ఎడియే కో-వైస్ చైర్మన్, పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మత్స్యశాఖ కమిషనర్‌తో పాటు ఎస్ఐఎఫ్టి, సిఐబిఏ, సిఐఎఫ్ఏ, సిఐఎఫ్టి, మత్స్య విశ్వవిద్యాలయం ప్రతినిధులు, రొయ్యల రైతులు, ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బస్సు ప్రమాద బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం

- సహాయక చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఇంటూరి



**వలేటివారిపాలెం(జర్నలిస్ట్ ఫైల్) :** ఈ ఏడాది మార్చి 26వ తేదీన మార్కాపురం సమీపంలోని రాయవరం వద్ద జరిగిన బస్సుప్రమాదంలో మండలంలోని అంకభూపాలపురం గ్రామానికి చెందిన ఒక మహిళ చనిపోగా, ఇద్దరు గాయపడ్డారు. ఆ ఘటనపై వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం ప్రకటించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అంకభూపాలపురం వెళ్లి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వం పంపించిన చెక్కులను వారికి అందించారు. బస్సు ప్రమాదంలో మృతి చెందిన బండారు పద్మ కుటుంబానికి 5 లక్షలు మంజూరు కాగా, ఆమె తల్లి అనంతమ్మకు ఎమ్మెల్యే చెక్కు అందించారు. పద్మ పిల్లలు ఇద్దరినీ యన్ టి ఆర్ ట్రస్ట్ భవన్ స్కూల్ లో చదివిస్తామని హామీ ఇచ్చారు. తీవ్రంగా గాయపడ్డ బత్తుల మణెమ్మ ను పరామర్శించిన ఎమ్మెల్యే ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. 2 లక్షల రూపాయల చెక్కును ఆమె భర్త వెంకటయ్యకు అందించారు. ఒంగోలు రిమ్స్ ఆర్ యం తో మాట్లాడి, మణెమ్మకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. మరో బాధిత చిన్నారి బత్తుల రోహన్ ను ఎమ్మెల్యే పరామర్శించారు. బాలుడి తల్లి శ్రీలక్ష్మికి 2 లక్షల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందించారు. రోహన్ చదువుకు అన్నివిధాలా సహాయం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్సు ప్రమాదం జరిగిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, బాధిత కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించిందని గుర్తుచేశారు. తాను కూడా ఆసుపత్రులకు వెళ్లి బాధితులను పరామర్శించానన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయాలు కూడా త్వరలోనే బాధితులకు అందజేస్తామని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, పార్టీ నాయకులు పెగడ శ్రీను, మోహన్, బండారు సోమరాజు, మాల్యాద్రి, పంది లక్ష్మీనారాయణ, సిరిగిరి కొండారెడ్డి, నరసింహం, వలేటి మధు తదితరులు పాల్గొన్నారు.

# కురుబల ఉన్నతి టీడీపీతోనే

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**మచిలీపట్నం(జర్నలిస్ట్ ఫైల్) :** కురుబల ఉన్నతి టీడీపీతోనే సాధ్యమని, ఆ సామాజిక వర్గీయులకు రాజకీయ, ఆర్థిక, సామాజిక గుర్తింపు కూడా అన్న ఎన్టీఆర్, సీఎం చంద్రబాబునాయుడుతోనే వచ్చిందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. విద్యతోనే ఉన్నత స్థానాలకు చేరుకోగలరని, కురుబ సామాజిక వర్గీయులు తమ బిడ్డలను ఉన్నత విద్య అభ్యసించేలా ప్రోత్సాహించాలని పిలుపునిచ్చారు. త్వరలోనే గుడికట్ల పూజారులకు గౌరవ వేతనాలు అందజేయనున్నట్లు తెలిపారు. బాపులపాడు మండలం కాకులపాడు గ్రామంలో బుధవారం జరిగిన శ్రీకామ్రవతీ సమేత బీరయ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి సవిత మాట్లాడుతూ, విద్యతోనే కురుబలు ఉన్నత స్థానాలకు చేరుకోగలరన్నారు. అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి, బీసీలకు అండగా నిలిచారన్నారు. తన తండ్రి, మాజీ మంత్రి సంజీవరెడ్డిగారి రామచంద్రారెడ్డిని అన్న ఎన్టీఆర్ రాజకీయంగా ప్రోత్సహించారన్నారు. ఎమ్మెల్యే టిక్కెటివ్వడమేకాకుండా మంత్రిగా అవకాశాలు ఇచ్చారన్నారు, అన్న ఎన్టీఆర్, సీఎం చంద్రబాబునాయుడు కేబినెట్లో అన్ని శాఖలకు మంత్రిగా పనిచేసిన ఘనత తన తండ్రిదన్నారు. టీడీపీ ప్రభుత్వాలతో అండదండలతోనే కురుబ సామాజిక వర్గానికి చెందిన తన తండ్రికి ఇంతటి గౌరవం లభించిందన్నారు. టీడీపీలో పనిచేసే ప్రతి కార్యకర్తకూ పదవులు వెతుక్కుంటూ వస్తాయని మంత్రి సవిత తెలిపారు.



**త్వరలో గుడికట్ల పూజారులకు గౌరవ వేతనాలు :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీలకు ఇచ్చిన హామీలను అమలుచేస్తూ వస్తోందని మంత్రి సవిత తెలిపారు. భక్త కనకదాస జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించేలా శాశ్వత జీవో జారీచేశామన్నారు. తిరుపతిలో కాంస్య విగ్రహ ఏర్పాటుకు మంత్రి నారా లోకేశ్ సహకారంతో స్థలం మంజూరైందన్నారు. త్వరలో గుడికట్ల పూజారులకు గౌరవ వేతనాలు అందించనున్నామన్నారు. కాకులపాడు బీరయ్య దేవస్థానం నిర్మించిన నిర్వాహకులకు మంత్రి సవిత అభినందించారు. గన్నవరం నియోజక వర్గ అభివృద్ధికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జరుపుతున్న కృషిని కొనియాడారు. విద్యలో రాణిస్తున్న కురుబ సామాజిక వర్గం విద్యార్థులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంతకుముందు న శ్రీకామ్రవతీ సమేత బీరయ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన మంత్రి సవితకు, ఎమెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు కాకులపాడు గ్రామస్తులు, కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. భారీ ర్యాలీ నిర్వహించి, గజమాలతో సత్కరించారు. ఆలయ పత్రిష్ఠాపన సందర్భంగా బీరయ్య స్వామి దేవస్థానంలో మంత్రి సవిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి సవితను కురబ సామాజిక వర్గీయులు ఘనంగా పత్కరించారు. ఈ కార్యక్రమంలో కురుబ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దేవంద్రప్ప, పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, కురుబ సామాజిక వర్గీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పిఠాపురం టెన్త్ టాపర్లకు పవన్ కళ్యాణ్ భరోసా



- ప్రభుత్వ పాఠశాలల్లో 580పైగా మార్కులు వచ్చిన విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్య
- నియోజకవర్గవ్యాప్తంగా 31 మంది గుర్తింపు
- విద్యార్థుల ఆసక్తికి తగిన విధంగా కోర్సుల ఎంపిక
- ఉప ముఖ్యమంత్రివర్యుల చొరవతో ముందుకు వచ్చిన విద్యా సంస్థలు

**పిఠాపురం (జర్నలిస్ట్ ఫైల్) :** పిఠాపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో రోల్ మోడల్ గా తీర్చిదిద్దే క్రమంలో ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న నిర్ణయాలు అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నాయి. ముఖ్యంగా పిఠాపురం నియోజకవర్గం పరిధిలో విద్యార్థులకు ఆయన వరాలు కురిపిస్తున్నారు. ఇప్పటికే తల్లిదండ్రులు లేని భగవంతుని పిల్లలకు నెలనెలా తన జీతాన్ని రూ. 5,000 చొప్పున నెలవారీ సాయం కింద అందిస్తున్న పవన్ కళ్యాణ్, ఇప్పుడు 10వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు వారి అభిరుచికి అనుగుణంగా ఉచితంగా ఉన్నత విద్యాభ్యాసం చేసే వెసులుబాటు కల్పిస్తున్నారు. పవన్ కళ్యాణ్ నుంచి రూ. 5 వేల సాయం అందుకుంటున్న వారిలో ఏడుగురు విద్యార్థులు 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించారు. వీరితోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 31 మంది 580 మార్కును దాటారు. ఈ విద్యార్థులలో 598 మార్కులు సాధించి, రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో నిలిచిన ఒక విద్యార్థి కూడా ఉన్నారు. వీరందరి ప్రతిభకు తనవంతు ప్రోత్సాహకంగా పై చదువులకు సాయం చేయాలని ఉప ముఖ్యమంత్రివర్యులు నిర్ణయించారు. ఈ మేరకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి, వారి ఆసక్తికి అనుగుణంగా కోర్సులు, కళాశాలలు ఎంపిక చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఆయా కళాశాలల యాజమాన్యాలతో సంప్రదింపులు జరిపి ఆ 31 మందికి ఉచిత విద్య ఏర్పాటు చేశారు. తన నిర్ణయాన్ని గౌరవించి, అడిగిన వెంటనే పిఠాపురం విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన విద్యాసంస్థలకు పవన్ కళ్యాణ్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని... ఉత్తమంగా రాణించాలని విద్యార్థులకు శుభాశీస్సులు అందించారు.

## పూర్వ వైద్య విద్యార్థుల ఔదార్యం



- కాకినాడ జీజీహెచ్‌లో రూ.98 కోట్లతో తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం సిద్ధమైన 5 అంతస్థుల భవనం త్వరలో ప్రారంభం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఉత్తర అమెరికాలోని రంగారాయ వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థుల ఔదార్యం, ప్రభుత్వ భాగస్వామ్యంతో కాకినాడ సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్)లో రూ. 98 కోట్ల వ్యయంతో నిర్మించిన తల్లీబిడ్డల (మాతా, శిశు) ఆరోగ్య భవనం సేవలు త్వరలో ప్రారంభం కాబోతున్నాయి. 465 పడకలతో 5 అంతస్తులతో అత్యాధునిక వసతులతో నిర్మితమైన ఈ భవనం ప్రారంభోత్సవం వచ్చేనెల 18వ తేదీ జరగబోతుందని, ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకారం తెలిపారని రంగరాయ మెడికల్ కాలేజ్ అలూమిని ఆఫ్ నార్త్ అమెరికా ఎంసీహెచ్ బిల్డింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఆచంట సుబ్బరాయ చౌదరి వెల్లడించారు. ఎంసీహెచ్ భవన నిర్మాణం, ప్రారంభోత్సవం, ఇతర వివరాల గురించి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మంత్రి సత్యకుమార్ యా దవ్ తో సుబ్బరాయ చౌదరి బుధవారం చర్చించారు. ఈ భవనం నిర్మాణానికి రూ. 70 కోట్ల వరకు వ్యయమైంది. ఇందులో రూ. 60 కోట్లను పూర్వ వైద్య విద్యార్థులు విరాళాల రూపంలో సమకూర్చారు. 1958 నుంచి 2002 మధ్య ఈ కళాశాలలో వైద్య విద్యను పూర్తిచేసిన వారిలో సుమారు 125 మంది తమ వంతు ఆర్థిక సహకారాన్ని అందించి, 5 అంతస్తుల భవన నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు కృషిచేశారు. అలాగే ఈ భవన నిర్మాణానికి మరో రూ. 11 కోట్లు, పరికరాల కోసం రూ. 27 కోట్లు ప్రభుత్వపరంగా సమకురాయి. ఒక ఫ్లోరులో పూర్తిగా నవజాత శిశువుల వార్డులు ఉన్నాయి. లామినర్ ఫ్లో సిస్టమ్స్ వంటి అత్యాధునిక సౌకర్యాలు ఈ భవనంలో ఉన్నాయి. దీనివల్ల మాతృమూర్తులు, శిశువులకు నాణ్యమైన వైద్య సేవలు ఉచితంగా అందుబాటులోనికి రాబోతున్నాయి.

# 12 వారాల ఉపాధి హామీ కూలీల డబ్బులు చెల్లించని బిజెపి ప్రభుత్వం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు పి అంజయ్య.

కరువు కాలంలో కూలీల పొట్ట కొడుతున్న కేంద్ర ప్రభుత్వం



ఇబ్రహీంపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : యాచారం మండలంలోని కుర్మిద్ద గ్రామంలో ఉపాధికూలీల పని ప్రదేశానికి పోయి వారి సమస్యలు అడిగి తెలుసుకొని మాట్లాడు తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి అంజయ్య 12 వారల నుండి కూలీలు పని చేస్తున్న ఇప్పటికి డబ్బులు రాకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కనీస అవసరాలు కూడా తిరడం లేదు అని మాతో కూలీలు వాపోయారు ఫోటో విధానం వలన తీవ్ర మైన ఇబ్బందులు వస్తున్నవి ఫోటో అఫ్ లోడ్ కాక పోవడం వలన ఎర్రటి ఎండలో కండ్లు గుంజంగా నిలబడ వసలసి వస్తుంది కొంత మందికి ఫోటో ఆఫ్ లోడ్ కాక పోవడం వలన ఏమి పని లేక ఇంటికాడ ఉండ వలసి వస్తుంది అని కూలీలు ఆవేదన చెందుతున్నారు భయంకరమైన ఎండలో పని చేసిన కనీసం నిడలేదు నీళ్లు ఓవరెస్ ప్యాకెట్లు అందుబాట్లో లేవు ఇలాగైతే వడదెబ్బ తాగిలి ప్రమాదం వచ్చే పరిస్థితి వుంది బిజెపి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా తీసివేయడం కోసమే చట్టంలో అనేకా మార్పులు చేసి పేదవాడి నోట్లో మట్టి కొడుతుంది మహాత్మా గాంధీ పేరుతో వున్నా ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి జి రామ్ జి చట్టంగా మారుస్తున్నారు గాంధీ పేరుతో వున్నా చట్టాన్ని కొనసాగించి . నూతనంగా తెచ్చిన జి రామ్ జి చట్టాన్ని రాద్దుచేయాలి చట్టానికి 2. లక్షల 50 వేలకోట్లు బడ్జెట్ పెంచాలి పెండంగ్ డబ్బులు వెంటనే విడుదల చేయాలి ఫోటో దింపే విధానం రద్దు చేయాలి పే స్లిప్పులు ఇవ్వాలి కొత్త జాబ్ కార్డులు ఇవ్వాలి కూలీలందరికి పని కల్పించాలి రోజుకూలీ 800రూపాయలు ఇవ్వాలి సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలి ఈ కార్యక్రమం లో 8వ వార్డు నంబర్ ఎం సురేష్ గోవర్ధన్ మల్లయ్య కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ గృహ ప్రవేశాలకు హాజరైన రాంరెడ్డి గోపాల రెడ్డి



ఖమ్మం, కామేపల్లి, మే 13 (జర్నలిస్ట్ఫైల్):కామేపల్లి మండలం పాత లింగాల గ్రామంలో వడ్డే బోయిన రాజేష్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ అండ్ రైతు కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు నూతన ఇందిరమ్మ ఇల్లును ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఇంటి లబ్ధిదారుడికి ప్రత్యేక అభినందనలు తెలుపుతూ ఇందిరమ్మ రాజ్యంలో పేదోడి సొంత ఇంటి కల నెరవేరిందని ఇందిరమ్మ ఇల్లు



మంజూరు అయిన ప్రతి లబ్ధిదారులు ఎంతో నాణ్యతతో నిర్మించుకుంటున్నారని , ఈ సందర్భంగా పేర్కొన్నారు. త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని, గ్రామాలలో ఉన్న అర్హులైన వారందరికీ ఇందిరమ్మ గృహాలు మంజూరు అవుతాయని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు రామ్ రెడ్డి జగన్నాథ్ రెడ్డి, నల్లమోతులక్ష్మయ్య, సర్పంచ్ కిన్నెర సుజాత, నాగయ్య, ఉప సర్పంచ్ గోపి , పల్లెర్ల నరసింహారావు, పల్లెర్ల ప్రసాద్, పంచాయతీ సెక్రెటరీ, హౌసింగ్ ఏఈ బేబీ, నాయకులు చామంతుల విశ్వనాథం, గొప్ప రమేష్, లావుడియా వినోద్, గుండ్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# సత్యనారాయణకు ఆకుల గాంధీ ఘన నివాళులు





ఖమ్మం, మే 13 (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం ఖానాపురం హవేలీ వాస్తవ్యులు మూలగుండ్ల సత్యనారాయణ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారు. సమాచారం తెలిసిన వెంటనే మున్నూరుకాపు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ దివంగత సత్యనారాయణ నివాసానికి చేరుకుని ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలదండ వేసి ఘనంగా నివాళులర్పించారు. సత్యనారాయణ మృతి పట్ల గాంధీ తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన కుమారులు శ్రీధర్,నవీన్, కూతురు ఆమని -బావ నర్సింహారావులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాంధీ, కార్పోరేటర్ దండా జ్యోతి రెడ్డి, సీనియర్ జర్నలిస్టు విజేత, మున్నూరు కాపు నాయకులు ఆకుల సురేష్ తదితరులు దివంగత సత్యనారాయణ కోడళ్లు రాధిక,రజిని,మనవళ్లు జయగుణ,ఎర్ర రంజిత్,భాస్కర్,పణి కుమార్, సత్యనారాయణ, సైదులుతో పాటు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# తాటిపాముల దివ్యమూర్తి కి సన్మానం



ఖమ్మం, మే 13 (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం నగ రానికి చెందిన తాటిపాముల దివ్య మూర్తి ని ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. భద్రాద్రి కొత్తగూడెం లో సింగరేణి లో మెడికల్ సూపర్వైజర్ గా విధులు నిర్వహించి 2008 రిటైర్ మెంట్ అన్నారు కాని ఆయనలో ఉన్న ప్రతిభ ఆధారంగా 1990 నుంచే రచయిత గా ప్రస్థానం ప్రారంభించారు. 2024లో వండర్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ 2025 లో లండన్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్, మహానంది ఉగాది పురస్కారం 2026 మే 3వ తేదీన ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతీ ఆడిటోరియంలో అన్నందో బ్రహ్మ అవార్డు బాబూమోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ లైన్ గణపతి సెంటర్ నిమ్మతోట ప్రాంత వాసులు అభినందించి సత్కరించారు.

# మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

--- కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన పూర్తి చేసి వెంటనే రశీదులు ఇవ్వాలి

--- స్థానిక హమాలీలను వంద శాతం వినియోగించి ఎక్కడా కొరత రాకుండా చూడాలి

--- ఖాళీగా ఉన్న ట్రాక్టర్లు, డీసీఎంలు సహా అన్ని వాహనాలను రవాణాకు వినియోగించాలి

--- మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి









ఖమ్మం, మే 13 (జర్నలిస్ట్ ఫైల్) :మొక్కజొన్న,ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు.మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు లతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఖమ్మం ఐడీఓసీ నుండి పాల్గొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రైవేట్ గోదామును అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని నిల్వ సదుపాయాలను పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వినియోగించాలని ఆదేశించారు. అవసరమైన వాహనాల ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని



సూచించారు.జిల్లాలో స్థానిక హమాలీలను వంద శాతం వినియోగించు కునేలా కార్యాచరణ రూపొందించాలని, ఎక్కడా హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హమాలీలు అధిక మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తే వారి లైసెన్సులను రద్దు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన అనంతరం రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు. పంట రవాణా కోసం ఖాళీగా ఉన్న అన్ని వాహనాలు, ట్రాక్టర్లు, డీసీఎం లను పూర్తి స్థాయిలో వినియోగించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి రోజు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపుల కోసం ఇప్పటివరకు 3 వేల 873 కోట్లను విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 కోట్ల 68 లక్షల గన్నీ సంచులను అందుబాటులో ఉంచామని, ఎటువంటి కొరత లేదని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్లు హమాలీలు, రవాణా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఫీడ్‌బ్యాక్ అందేలా వ్యవస్థ ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్నీ సంచులు, హమాలీలు, రవాణా వాహనాల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు చెల్లింపులు వేగంగా జరిగేలా ట్యాబ్ ఎంట్రీలు వెంటనే పూర్తి చేయాలని సూచించారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారీగా మొక్కజొన్న దిగుబడి వచ్చిందని, రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం, మొక్కజొన్న తెలంగాణలోకి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన బందోబస్తు, విజిలెన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాల సూచనలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ కొనుగోళ్ల వేగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతున్నాయని, రాబోయే ఒక నెల అత్యంత కీలకమని, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 2 లక్షల 22 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 2 లక్షల 78 వేల టన్నుల మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలకు చేరినట్లు తెలిపారు. గత వారం రోజుల్లోనే లక్షా యాభై వేల టన్నుల అదనపు నిల్వ సామర్థ్యాన్ని సృష్టించి కొనుగోళ్లు వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఎస్ఓ చందన్ కుమార్, డిఆర్డిఓ శ్రీరామ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, డిసిఓ గంగాధర్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ. అలీం, ఇంచార్జీ డిఎం సివిల్ సప్లై సునీల్ రెడ్డి, ఆర్డీఓ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహోన్నత వ్యక్తిత్వం గల మహా నాయకుడు తుమ్మల - తుమ్మల తో జర్నలిస్టుల అనుబంధం మరువలేనిది



ఖమ్మం, ఇల్లందు, మే 13 (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం జిల్లాను విశేషంగా అభివృద్ధి చేసిన మహోన్నత వ్యక్తిత్వం గల మహా నాయకుడు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అని, ఆయనతో జర్నలిస్టుల అనుబంధం మరువలేనిదని సీనియర్ జర్నలిస్ట్ ఎస్ వి సూర్యనారాయణ స్పష్టం చేశారు. 1984 నుంచి ఖమ్మం జిల్లా కేంద్రంలో పనిచేసిన జర్నలిస్టులందరికీ తుమ్మల నాగేశ్వరరావు సుపరిచితులని, ఆయనకు జర్నలిస్టుల పట్ల ఎంతో గౌరవభావం ఉండేదని తెలిపారు. 1985 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అప్పటి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎన్టీ రామారావు సత్తుపల్లి వచ్చి ప్రజాసేవ చేయాలనే సంకల్పం గల విద్యావంతుడైన యువకుడిని తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేశానని, ప్రజలు తప్పనిసరిగా గెలిపించాలని కోరుతూ తుమ్మల నాగేశ్వరరావును నియోజవర్గ ప్రజలకు పరిచయం చేశారని, ఆ సన్నివేశం ఎప్పటికీ మరువలేనిదని తెలిపారు. అప్పటి నుంచి ఆయన తనకు బాగా తెలుసునని ఆ మధుర జ్ఞాపకాలను సూర్యనారాయణ నెమరువేసుకున్నారు. ప్రజాసేవయే పరమావధిగా రాజకీయాలలో ప్రవేశించి, ఉన్నత శిఖరాలను అధిరోహించి, ప్రజల సంక్షేమానికి, జిల్లా అభివృద్ధికి పథకాలను,కార్యక్రమాలను చేపట్టిన తుమ్మల అభినందనీయుడని ప్రశంసించారు. 1986 నుంచి నేటి వరకు నాలుగు సార్లు రాష్ట్ర మంత్రిగా బాధ్యతలను స్వీకరించి ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టి ప్రజల హృదయాలలో చెరగని ముద్రవేశారని ఆయన కొనియాడారు. నిజాయితీకి ప్రతిరూపంగా తుమ్మల ప్రజలలో పేరు పొందారని, అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలతో నాలుగు దశాబ్దాల పాటు ప్రజలకు విశేష సేవలు అందించారని, ఎన్నో విజయాలను సాధించిన ఆయన రాజకీయ ప్రస్థానం అందరికీ స్ఫూర్తిదాయకమని స్పష్టం చేశారు. గతంలో ఖమ్మం జిల్లాలోని మారుమూల గిరిజన ప్రాంతంలో గల గుండాల మండలాన్ని అభివృద్ధి చేసిన ఘనత తుమ్మలకే దక్కుతుందని తెలిపారు. ఖమ్మంలో జర్నలిస్టుగా పనిచేసిన కాలంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎన్నో కార్యక్రమాలకు, సమావేశాలకు తాను హాజరయ్యానని, ఆ రోజులు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. జర్నలిస్టుగా తనకు ఆయనంటే ఎంతో గౌరవం అని, మానవత్వం తొణికిసలాడే హృదయం ఉన్న సహృదయుడు తుమ్మల అని కొనియాడారు. కాలగమనంలో నాలుగు దశాబ్దాలు గడిచిపోయినా అప్పట్లో ఖమ్మంలో నాగేశ్వరరావు చెరగని ముద్ర వేశారని అది నేటికీ స్ఫూర్తినిస్తోందని తెలియజేశారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 40 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా నిష్కళంక ప్రజానాయకుడైన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో ప్రజలకు విశేషంగా సేవ చేయుటకు ఆయనకు నిండు నూరేళ్లు ఆయురారోగ్యములను ప్రసాదించాలని దేవున్ని ప్రార్థిస్తున్నానని సీనియర్ జర్నలిస్ట్ సూర్యనారాయణ తెలిపారు.

# బండి భగీరథ్‌ను అరెస్టు చేసి వెంటనే రిమాండ్ చేయాలి -- బండి సంజయ్ మంత్రి పదవి నుంచి తొలగించాలి



వికారాబాద్ మే 13 (జర్నలిస్ట్ ఫైల్) : వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తా వద్ద భారత విద్యార్థి ఫెడరేషన్, ప్రజాస్వామ్య యువజన సమాఖ్య, మహిళా సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బండి భగీరథ్‌పై నమోదైన కేసులో వెంటనే అరెస్టు చేసి రిమాండ్ చేయాలని డిమాండ్ చేశారు.నాయకులు మాట్లాడుతూ మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు ఉన్నప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అధికార ప్రభావంతో కేసును మసకబార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉన్నవారి కుటుంబంలోనే చట్ట ఉల్లంఘనలు జరిగితే సమాజానికి తప్పు సందేశం వెళ్తుందని అన్నారు.తన కుమారుడిపై తీవ్రమైన కేసు నమోదు అయిన నేపథ్యంలో బండి సంజయ్ మంత్రి పదవిలో కొనసాగడం నైతికంగా సరైంది కాదని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బాధిత బాలిక కుటుంబానికి రక్షణ కల్పించి సమగ్ర విచారణ జరపాలని కోరారు.గతంలో కూడా భగీరథ్‌పై ర్యాగింగ్ మరియు మాదకద్రవ్యాల వినియోగంపై ఆరోపణలు వచ్చాయని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి బెదిరింపులు వస్తున్నాయని చెప్పి వెంటనే భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే ఉన్నత స్థాయి కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు దీపక్, గోపాల్, కిషన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దేవరయంజాల్‌లో అంగరంగ వైభవంగా హనుమాన్ జయంతి

పంచామృత అభిషేకం.. వడమాల పూజలతో భక్తుల సందడి



శామీర్‌పేట్,మే 13(జర్నలిస్ట్ ఫైల్): శామీర్‌పేట్ మండలం దేవరయంజాల్‌లోని సుమారు 250 సంవత్సరాల చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాచీన అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం హనుమాన్ జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రాంతంలో ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రంగా పేరుగాంచిన ఈ ఆలయానికి హనుమాన్ జయంతి సందర్భంగా వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని



దర్శించుకున్నారు.హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాన్ని పండ్లు, ఫలహారాలు, అరటి చెట్లతో ప్రత్యేకంగా అలంకరించగా ఆలయం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. ఉదయం నుంచే భక్తులు భారీ సంఖ్యలో చేరుకుని స్వామివారికి పంచామృత అభిషేకం, వడమాల పూజ, అష్టోత్తర పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అర్చనలు, మహా హారతులు నిర్వహించారు.హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సాయంత్రం హనుమాన్ సేవ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. "జై శ్రీరామ్" నినాదాలతో దేవరయంజాల్ గ్రామం మొత్తం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది.స్థానికుల విశ్వాసం ప్రకారం పెండ్లి కాని యువతులు ఈ ఆలయంలో స్వామివారిని నిష్టగా పూజిస్తే కల్యాణ యోగం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తుంటారు. దీంతో పరిసర ప్రాంతాల నుంచి కూడా యువతులు పెద్ద సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఈ. శ్రీనివాస్ మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందడం ఆనందంగా ఉందన్నారు. గ్రామ యువత, హనుమాన్ యూత్ సభ్యులు ఉత్సవాల విజయవంతానికి విశేషంగా కృషి చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో హనుమాన్ యూత్ సభ్యులు ఎడంబోయిన శ్రీనివాస్, జూపల్లి శ్రీనివాస్, అల్లాడి కృష్ణారెడ్డి, పీఆర్‌సీ రెడ్డి, అనిరుద్, టీంకు గౌడ్, దుసరి మహేష్ గౌడ్, పట్నం నర్సింహారెడ్డి, కాడే వెంకటేష్, బి. నగేష్ గౌడ్, మన్నె పురుషోత్తంరెడ్డి, బి. బాలింగ్ గౌడ్, ఎస్. సురేష్, సముద్రాల సురేష్ సేవలందించారు.ప్రత్యేక పూజల్లో మాజీ కౌన్సిలర్లు పి. నర్సింహారావు గౌడ్, యాదమ నర్సింహా గౌడ్, రామాలయ ఆలయ మాజీ చైర్మన్లు పన్నాల సుధాకర్ రెడ్డి, పెండెం లక్ష్మీనారాయణ, జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్ రెడ్డి, మల్కాజ్గిరి ప్రెస్ క్లబ్ జనరల్ సెక్రటరీ విశాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. 12ఎస్ ఎమ్ పి టి 1 దేవరయంజాలలో అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు12ఎస్ ఎమ్ పి టి 2 దేవర యంజాల లోని అభయ ఆంజనేయ స్వామి ఆలయం

## 17న మంగళగిరి నియోజకవర్గ మహానాడు



○ రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్, మంగళగిరి నియోజకవర్గ టీడీపీ సమన్వయ కర్త నందం అబద్ధయ్య

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** ఈ నెల 17వ తేదీన మంగళగిరి నియోజకవర్గ మహానాడు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్, మంగళగిరి నియోజకవర్గ టీడీపీ సమన్వయ కర్త నందం అబద్ధయ్య తెలిపారు. తాడేపల్లి బైపాస్ వద్ద డీ మార్ట్ సమీపంలోని అవంత బ్యాంకెట్ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు మహానాడు కార్యక్రమం ప్రారంభం కానుందని పేర్కొన్నారు.

ఈ మహానాడు కార్యక్రమంలో గత ఏడాది కాలంలో మరణించిన పార్టీ కార్యకర్తలకు సంతాప తీర్మానం చేయడంతో పాటు, మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్యమైన తీర్మానాలు ప్రవేశపెట్టి చర్చించనున్నట్లు తెలిపారు.

మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో మంగళగిరి నియోజకవర్గం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని,ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు మంత్రి లోకేష్ సొంత నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఈ సందర్భంగా తెలిపారు.

నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై నియోజకవర్గ మహానాడును విజయవంతం చేయాలని నందం అబద్ధయ్య కోరారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఈస్ట్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురిపై కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు వివిధ శిక్షలు విధించింది. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాస్ పర్యవేక్షణలో ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురిని పోలీసులు గుర్తించారు. వారిలో ద్విచక్ర వాహనం నడిపిన ఒకరికి రూ.10 వేల జరిమానా విధించగా, మద్యం సేవించి ఆటోలు నడిపిన ఇద్దరికి ఒక్కొక్కరికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు. అలాగే మద్యం సేవించి కారు నడిపిన మరో వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఈ సందర్భంగా ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ, ప్రజలు తమ ప్రాణ భద్రతతో పాటు ఇతరుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరిస్తూ, ఇటువంటి ఉల్లంఘనలపై భవిష్యత్తులో కూడా కఠిన చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

## చేనేత అభివృద్ధికి మంత్రి లోకేష్ కృషి



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి శ్రీ పానకాలస్వామి ఘాట్ రోడ్డు టోల్గేట్ వద్ద బుధవారం సిరి హ్యాండ్లూమ్స్ నూతన వ్యాపార సంస్థ, ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ లను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు హాజరై హ్యాండ్లూమ్స్, వాటర్ ప్లాంట్లను ప్రారంభించారు. గుత్తికొండ తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి హ్యాండ్లూమ్స్ ను, అనంతరం ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గుత్తికొండ మాట్లాడారు. చేనేతకు పూర్వ వైభవం తీసుకురావడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారని, దానికి నిదర్శనంగా పట్టణంలో అనేక హ్యాండ్లూమ్స్ వ్యాపార సంస్థలు ప్రారంభోత్సవాలు జరుపుకుంటున్నాయన్నారు. మంత్రి లోకేష్ 2047 విజన్ తో ముందుకు వెళ్తున్నారన్నారు. మంగళగిరి చేనేతకు మంచి పేరు ఉందని, కార్మికులు ఇక్కడ నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తారన్నారు. సంస్థ యజమానులు తమ వ్యాపారంతో పాటు ప్రజలకు సేవ అందించాలని, ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ను కూడా ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి, రాష్ట్రగౌడ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వాకా రామ్ గోపాల్ గౌడ్, వేముల వెంకటాచలం, టీడీపీ నాయకులు మన్నెం శ్రీనివాసరావు, వాకా మాధవరావు గౌడ్, గోవాడ దుర్గారావు, జొన్నాదుల బాలకృష్ణ, వీరంకి రంగారావు, క్రోసూరి రాజశేఖర్, జగ్గారపు రాము, తాతా కోటయ్య, రేఖా వకుళాదేవి, జనసేన నాయకులు మునగపాటి వెంకట మారుతీరావు, హ్యాండ్లూమ్స్ అధినేతల పాగోలు శ్యాం ప్రసాద్, పాలడుగు శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఓవర్ లోడ్ టిప్పర్లపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఫైర్

○ రోడ్లు పాడు చేస్తూ, ప్రజల ప్రాణాలతో ఆటలాడితే సహించబోమని హెచ్చరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

○ భారీ లోడ్ల వాహనాల నియంత్రణపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో పరిమితికి మించి అధిక లోడుతో వెళ్తున్న టిప్పర్ లారీలు రోడ్లు పాడు చేస్తూ, ప్రజల ప్రాణాలతో ఆటలాడితే సహించబోమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తేల్చిచెప్పారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి క్యాంప్ కార్యాలయంలో నగరంలో భారీ లోడ్ల టిప్పర్ లారీలు, ఓవర్‌లోడ్ వాహనాల సంచారం, రోడ్ల ధ్వంసం, ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులపై పలు శాఖల అధికారులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి మైనింగ్ డీడీ చంద్రశేఖర్, ఆర్టీఓ అధికారులు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, ఆర్ & బీ డీఈ, నగరపాలక సంస్థ డీఈలు, ట్రాఫిక్ ఎస్ఐ, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని ఎస్‌వీఎన్ కాలనీ, అమరావతి రోడ్, పట్టాభిపురం బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో సమయపాలన లేకుండా భారీ లోడ్ల టిప్పర్లు ఇష్టానుసారంగా తిరుగుతున్నాయని, పలుమార్లు ఫిర్యాదులు వచ్చినప్పటికీ అధికారులు కేవలం బోర్డులు పెట్టడం తప్ప కఠిన చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు.

"టిప్పర్ సామర్థ్యం 22 నుంచి 28 టన్నుల వరకు ఉంటే, 50 నుంచి 60 టన్నుల వరకు లోడ్లు ఎలా తీసుకెళ్తున్నారు? ఇది ఎవరి అనుమతితో జరుగుతోంది? ఏ శాఖ పర్యవేక్షణలో ఉంది?" అంటూ ఎమ్మెల్యే అధికారులను నిలదీశారు.

రోడ్ల మధ్యలో ఇసుక, కంకర కారుతూ వెళ్లడం వల్ల ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎప్పుడైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలే కోట్ల రూపాయలతో వేసిన బీటీ రోడ్లు భారీ లోడ్ల వాహనాలతో పూర్తిగా ధ్వంసమవుతున్నాయని అన్నారు.

"రోడ్లు పాడవ్వడం నిమిషాల పని... వాటిని బాగుచేయడం కోసం నెలలు, సంవత్సరాలు పడుతోంది. చివరికి ప్రజలు ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను తప్పుపడుతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఓవర్‌లోడ్ వాహనాలపై చర్యలు తీసుకోవడంలో శాఖల మధ్య సమన్వయం లేకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఒక్క శాఖ మరొక శాఖపై నెట్టేస్తే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయి? ప్రజలకు సమాధానం ఎవరు చెబుతారు?" అంటూ ప్రశ్నించారు.

అదేవిధంగా నగర పరిధిలో ఖాళీ స్థలాల్లో అక్రమంగా ఇసుక డంపింగ్ జరుగుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఫిర్యాదులు ఇచ్చినా సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయని తెలిపారు.

పలు ప్రాంతాల్లో గుంతలు పూడ్చటం లేదని, నాసిరకం రోడ్డు మరమ్మతులపై కూడా ఎమ్మెల్యే తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "ప్రతి సమస్యను ప్రజాప్రతినిధులే గుర్తించి చెప్పాలా? అధికారులు స్వయంగా పర్యవేక్షణ చేయరా?" అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

నగరంలో భారీ లోడ్ల వాహనాలకు కఠిన సమయ పరిమితులు విధించాలి,నగరంలోకి ఓవర్‌లోడ్ టిప్పర్ల ప్రవేశాన్ని నియంత్రించాలి,చెక్ పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటల పర్యవేక్షణ చేపట్టాలి,అక్రమ ఇసుక డంపింగ్ కేంద్రాలపై వెంటనే చర్యలు తీసుకోవాలి,రోడ్ల నాణ్యతపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి,ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. "ప్రజల ప్రాణాలతో ఆటలాడే విధంగా ఎలాంటి నిర్లక్ష్యం సహించం. అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

# యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టండి

○ ట్రాఫిక్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి

○ డ్రెయిన్ల నిర్మాణం వేగవంతం చేయండి

○ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించండి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు తూర్పు నియోజకవర్గంలో డ్రెయిన్లు, రోడ్లు, విద్యుత్ సరఫరా ట్రాఫిక్ వంటి అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా వేగవంతంగా పూర్తి చేసేందుకు మున్సిపల్ శానిటేషన్, విద్యుత్ ఇంజనీరింగ్, ట్రాఫిక్ పోలీసు అధికారులతో కలిసి ఎమ్మెల్యే వివిధ ప్రాంతాల్లో పర్యటించాను. తొలుత జిన్నా టవర్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు చేపట్టిన డ్రెయిన్ల నిర్మాణానికి సంబంధించి ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడాను. ఈ ప్రాంతం ట్రాఫిక్ రద్దీగా ఉంటుందని, త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించాను. మణిపురం బ్రిడ్జి వెంట సర్వీసు రోడ్డులో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశాను. అనంతరం అధికారులతో కలిసి కబడ్డీ గూడెం ప్రాంతంలో పర్యటించాను. అక్కడ డ్రెయిన్ల విస్తరణతోపాటు శ్మశాన వాటికలో వసతుల కల్పనపై చర్చించాను. కొత్తపేటలోని బ్రింద న్యూరో కేర్ వద్ద డ్రెయిన్ నిర్మాణంపై చర్చించాను. అదే సమయంలో ఆటోనగర్ ప్రధాన డ్రెయిన్ నిర్మాణం విషయంలో వేగవంతంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించాను. ఆటోనగర్ నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత పోలీస్ అధికారులకు చెప్పాను. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పక్కా ప్రణాళికతో అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నాం. ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక ప్రతి ప్రాంతాన్ని సమాన స్థాయిలో అభివృద్ధి పథంలోకి తీసుకెళుతున్నామని చెప్పడానికి సంతోషంగా ఉంది.

## మంత్రి నారా లోకేష్ ఆలోచనలకు ప్రతిరూపంగా "మహాప్రస్థానం"

○ పాతమంగళగిరి హిందూ శ్మశానవాటికకు సరికొత్త రూపు

○ పర్యావరణ హితంగా, గౌరవప్రద అంతిమ వీడ్కోలుకు ప్రత్యేక వేదిక



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** పాతమంగళగిరి హిందూ శ్మశానవాటికకు ఆధునిక రూపు తీసుకువస్తూ రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించారు. మంగళగిరి నియోజకవర్గాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న మంత్రి లోకేష్, ప్రజల ప్రాథమిక అవసరాలకు అనుగుణంగా శ్మశానవాటికల అభివృద్ధిని ప్రాధాన్యతగా తీసుకున్నారు. నియోజకవర్గంలోని శ్మశానవాటికల పరిస్థితులు దయనీయంగా ఉండటంతో వాటి రూపురేఖలు మార్చేందుకు స్వంత నిధులతో పాటు వివిధ సంస్థల సహకారంతో ఆధునిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే కొన్ని శ్మశానవాటికలు పూర్తికాగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ క్రమంలో పాతమంగళగిరిలోని హిందూ శ్మశానవాటికను పూర్తిగా ఆధునీకీకరించేందుకు ఫీనిక్స్ గ్రూప్ నుంచి రూ. 3 కోట్ల సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం పునర్నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పనులు పూర్తయిన అనంతరం ఈ మహాప్రస్థానం ప్రజలకు పరిశుభ్రమైన, ప్రశాంతమైన, గౌరవప్రదమైన అంతిమ వీడ్కోలు కేంద్రంగా నిలవనుంది. సుమారు రెండెకరాల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఈ మహాప్రస్థానంలో నాలుగు చితులు, వేచి ఉండే గదులు, అన్నదాన హాల్, పురుషులు-మహిళల కోసం ప్రత్యేక వాష్‌రూములు, మార్చురీ, విస్తారమైన వాహన పార్కింగ్, చెక్క నిల్వ కేంద్రం, కర్మకాండల గదులు, పక్షులకు ఆహార ప్రదేశం, అందమైన ల్యాండ్‌స్కేపింగ్, అంతర్గత రహదారులు వంటి ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. పర్యావరణ హితంగా రూపుదిద్దుకుంటున్న ఈ శ్మశానవాటిక కుటుంబ సభ్యులకు ఓదార్పునిచ్చే వాతావరణాన్ని కల్పిస్తూ, తమ ప్రియమైనవారికి గౌరవప్రదమైన అంతిమ వీడ్కోలు పలికేలా ప్రత్యేకంగా నిర్మిస్తున్నారు. పనులు పూర్తయిన తర్వాత ఇది మంగళగిరి ప్రజలు గర్వంగా చెప్పుకునే స్థాయిలో నిలవనుంది. మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి రంగంలో ప్రత్యేక ముద్ర వేస్తూ ప్రజలకు అవసరమైన సదుపాయాలను అందించడంలో మంత్రి లోకేష్ కృషి చిరస్మరణీయమని పుర ప్రజలు అభినందిస్తున్నారు.



## మద్దిరాలకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ అభినందనలు



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైనటువంటి శ్రీ మద్దిరాల గంగాధర్ కు స్థానిక టీడీపీ కార్యాలయం లో ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఖచ్చితంగా ఉంటుందని.. దీనికి నిదర్శనం గంగాధరే అని అన్నారు. అంకితభావంతో పార్టీ బలోపేతం కొరకు పనిచేయడం వల్లనే రాష్ట్ర కార్యదర్శి పదవి వరించిందని అన్నారు. అన్ని జిల్లాలు తిరిగి బీసీ సామాజిక వర్గాల తరుపున పని చేసినటువంటి వ్యక్తి గంగాధర్ అని అన్నారు. గత వైకాపా ప్రభుత్వం అవలంబిస్తున్న బీసీ సామాజిక వర్గ ప్రజా వ్యతిరేక విధానాలని ప్రజల్లోకి తీసుకెళ్లి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పాటులో భాగమయ్యారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను నిత్యం ప్రజల్లోకి తీసుకెళ్తు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తున్నారని అన్నారు. ఇదేవిధంగా కష్టపడుతూ రాబోయే రోజుల్లో గంగాధర్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే పుట్టా



**ఒనిపెంట (జర్నలిస్ట్ ఫైల్ ):** మైదుకూరు నియోజకవర్గంలోని వనిపెంట సమీప జాతీయ రహదారిపై మూడు వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకుంది. అదే మార్గంలో వివాహ వేడుకలు ముగించుకొని ముగించుకొని ప్రయాణిస్తున్న మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ వెంటనే తన వాహనాన్ని ఆపి పరిస్థితిని పరిశీలించారు. క్షతగాత్రులకు తక్షణ సహాయం అందించేందుకు 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించి వారిని ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. ప్రమాదంలో గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జాతీయ రహదారి అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే గారు, ఆ ప్రాంతంలో కొనసాగుతున్న పెండింగ్ రహదారి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ఘనంగా కె.ఆర్ కృష్ణయ్య జయంతి వేడుకలు



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారిమఠం టౌన్ పరిధి లోని ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్( అవోప) వారిచే అవోప వ్యవస్థాపకులు కేఆర్ కృష్ణయ్య 127 జయంతి పునస్కరించుకొని ఆయన ఫోటోకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మంగారిమఠం అవోపా అధ్యక్షులు ముచ్చర్ల శేషయ్య కార్యదర్శి పత్తి సురేష్ గుప్తా రాష్ట్ర అవోపా ఈసీ మెంబెర్ బింగి సూర్యనారాయణ అవోపా సభ్యులు గంగిశెట్టి సతీష్ కొలిశెట్టి వీరభద్రయ్య ముచ్చర్ల రాధాకృష్ణ మొదలగు వారు పాల్గొన్నారు.

# ఆసుపత్రులు, కార్యాలయాల్లో ఫైర్ ఆడిట్ నిర్వహించాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఆసుపత్రులు, కార్యాలయాల్లో ఫైర్ ఆడిట్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ ఆదేశించారు. మంగళ, బుధవారాలలో జరిగిన అగ్ని ప్రమాదాలు దృష్ట్యా బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత శాఖలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైర్ ఆడిట్ నిర్వహించాలని అన్నారు. ఫైర్ ఆడిట్ తో పాటు ఆసుపత్రిలో సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడ అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి నెల ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులలో మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. ఫైవ్ ఆడిట్ లో కనుగొన్న లోపాలను సంబంధిత ఆసుపత్రిలు, కార్యాలయాలు తక్షణం పునరుద్ధరణ చేయాలని పేర్కొన్నారు. అగ్నిమాపక పరికరాల ఎక్స్పైరీ డేట్ ను కూడా విధిగా పరిశీలించాలని ఆయన ఆదేశించారు. వేసవి తీవ్రత ఉందని ఈ సమయంలో విద్యుత్తు ఉపకరణాలు వినియోగం అధికంగా ఉంటుందని విద్యుత్ లోడుకు తగిన విధంగా లేనట్లయితే షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంటుందని పేర్కొంటూ అటువంటి లోపాలు కనుగొనుటకు విద్యుత్ ఆడిట్ ను నిర్వహించాలని ఆదేశించారు. మునిసిపల్, పంచాయతీ పరిధిలలో చెత్త సేకరణ పక్కాగా జరగాలని ఆదేశించారు. చెత్త అనేక ప్రాంతాల్లో కాల్చడం జరుగుతుందని అటువంటి పద్ధతులను అవలంబించే రాదని ఆదేశించారు. మునిసిపల్ పరిధిలో చెత్త శుభ్రత కార్యక్రమం రహదారుల కు మాత్రమే పరిమితం కాకుండా పట్టణం మొత్తం పరిశుభ్రంగా ఉండుటకు చర్యలు చేపట్టాలని సూచించారు.

**మీడియా వార్తతో ప్రయోజనం**

గత నెలలో అగ్ని ప్రమాదాలపై మీడియాలో ప్రచురితమైన ఒక వార్త బాగా ఉపయోగపడిందని జిల్లా కలెక్టర్ అన్నారు. వార్త సమాచారంతో వెంటనే అగ్నిమాపక అధికారికి ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఆ మేరకు జి జి హెచ్ లో మాకు డ్రిల్ నిర్వహణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఈ మార్క్ డ్రిల్ కార్యక్రమం మంగళవారం జరిగిన అగ్ని ప్రమాద నివారణకు ఎంతగానో తోడ్పడిందని అన్నారు. ప్రజల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

**జి.జి.హెచ్ ను తనిఖీ చేసిన కలెక్టర్**

జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం తనిఖీ చేసి ప్రమాద సంఘటనపై ఆరా తీశారు. సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని, అగ్నిమాపక వ్యవస్థ పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు,జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, ఎం.టి.ఎం.సి కమిషనర్ అలీం భాషా, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె రామ అప్పల నాయుడు, ఎ.పి.ఎం.ఎస్.ఐ.డి.సి కార్యనిర్వహక ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## సాయి జ్యోతికి ఏఐ స్మార్ట్ కళ్ళజోడు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** నిడమర్రులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కిమ్స్ ప్రైవేట్ హాస్పటల్ కు భూమి పూజ నిర్వహించిన సందర్భంలో బుధవారం హాస్పటల్ 100 మంది అంధులకు ఏఐ సెన్సార్లు, కెమెరాలతో అత్యాధునిక సాంకేతికతో తయారు చేసిన ఏఐ స్మార్ట్ కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. పాత మంగళగిరికి చెందిన చింతక్రింది సాయి జ్యోతి సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా స్మార్ట్ కళ్ళజోడు అందుకున్నారు. ఈ కళ్ళజోడు స్మార్ట్ ఫోన్ కు అనుసంధానం చేసి ఉండటం వలన అంధులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కెమెరాలు, సెన్సార్ల సాయంతో ముందు ఉన్న వస్తువులు, వ్యక్తులు, అక్షరాలను గుర్తించి వాయిస్ రూపంలో వివరాలు చెబుతాయి. స్మార్ట్ కళ్ళజోడును సీఎం చేతుల మీదుగా అందుకోవటం సంతోషంగా ఉందని సాయి జ్యోతి అన్నారు.

## పొదుపు చర్యల్లో భాగంగా కాన్వాయ్ వాహనాల కుదింపు

○ **పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గిస్తూ పొదుపు చర్యలు చేపట్టాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన సూచనల మేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను 50 శాతం వరకు తగ్గించాలని భద్రతా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

జిల్లా పర్యటనల సమయంలో కూడా వాహన శ్రేణిలో అనవసర వాహనాలను తగ్గించి, సగానికి కుదించాలని నిర్ణయించినట్లు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో దేశ ప్రజలు ఇంధన పొదుపు చర్యలు పాటించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. తాను కూడా అదే విధానాన్ని అమలు చేస్తుండటంతో, ఆ స్ఫూర్తిని రాష్ట్రంలో కొనసాగించాలని పవన్ కళ్యాణ్ నిర్ణయించినట్లు వెల్లడించారు.

## బొలినేని మెడికల్ కాలేజీ శంకుస్థాపనకు పటిష్ట బందోబస్తు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా నిడమర్రులో ఏర్పాటు కానున్న బొలినేని మెడికల్ కాలేజీ మరియు స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ శంకుస్థాపన కార్యక్రమానికి జిల్లా పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్న ఈ కార్యక్రమానికి సంబంధించి గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠీ, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ క్షేత్ర స్థాయిలో పర్యటించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

కార్యక్రమ ప్రాంగణం, వీఐపీ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, హెలిప్యాడ్ పరిసరాలు, ప్రజల రాకపోకలకు సంబంధించిన ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించిన వారు, భద్రతా చర్యలపై పలు సూచనలు చేశారు.

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బహుస్థాయి భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమ ప్రాంగణంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ, డ్రోన్ మానిటరింగ్, ట్రాఫిక్ డైవర్షన్లు, ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు, మహిళల భద్రత చర్యలు, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు.

జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందితో విస్తృత బందోబస్తు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ సూచనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఏటీవీ రవికుమార్ (ఎల్ అండ్ ఓ), ఏ హనుమంతు (ఏఆర్), నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్బీ డీఎస్పీ అలహారి శ్రీనివాస్ తదితర అధికారులు, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉర్దూ భాషాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కృషి



○ **సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు "ఆవో ఉర్దూ సిఖే" పుస్తకాల పంపిణీ**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని కృష్ణనగర్‌లో ఉన్న ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ కంప్యూటర్ సెంటర్ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఉర్దూ అకాడమీ రూపొందించిన "ఆవో ఉర్దూ సిఖే" పుస్తకాలను హౌసింగ్ బోర్డ్ కాలనీలోని మజీద్-ఏ-ఖూబా కమిటీ నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు పంపిణీ చేశారు.

వేసవి సెలవుల్లో విద్యార్థులు సులభంగా ఉర్దూ భాషను నేర్చుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉర్దూ అకాడమీ రూపొందించిన ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందని మసీదు కమిటీ కార్యదర్శి పఠాన్ ఖాసిం ఖాన్ తెలిపారు. ఉర్దూ భాషపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఈ పుస్తకం ఒక వరంలాంటిదని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉర్దూ భాషను నేర్చుకోవాలని ఉపాధ్యాయులు మొహమ్మద్ హస్సన్ బేగ్ కోరారు.

ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ సిబ్బంది అబ్దుల్ రెహమాన్ బేగ్, మసీదు సమ్మర్ క్యాంప్ నిర్వాహకులు షేక్ కరీముల్లా, ఎం.డి. హమీద్, ఎం.డి. అన్వరుల్లా, షేక్ జమీర్ తదితరులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అమరావతి భవిష్యత్‌లో ప్రపంచ స్థాయి హెల్త్ క్యాపిటల్‌గా ఎదుగుతుంది

○ **కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా నిడమర్రులో బొలినేని మెడికల్ కాలేజీ మరియు స్కిల్ డెవలెప్మెంట్ యూనివర్సిటీకి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ... అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాటిన విత్తనం భవిష్యత్తులో మహావృక్షంగా మారబోతోందన్నారు. మానవ జీవితాలను మార్చగలిగే శక్తి ఉన్న ఆరోగ్య వ్యవస్థకు కిమ్స్ రూపకల్పన నాంది పలుకుతోందన్నారు.

మెడికల్ కాలేజీలు, అలైడ్ హెల్త్ సైన్సెస్, నర్సింగ్, ఫార్మాకాలజీ, డెంటల్, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ రంగాల సమగ్ర అభివృద్ధితో అమరావతి ఒక స్కిల్ క్యాపిటల్‌గా, హెల్త్ క్యాపిటల్‌గా ఎదుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఒక రోగి చికిత్సలో వైద్యులతో పాటు నర్సులు, ఫిజియోథెరపిస్టులు, ఇతర వైద్య సిబ్బంది సమన్వయం ఎంతో కీలకమని, ఇంటిగ్రేటెడ్ కేర్ వ్యవస్థ ఉన్న ప్రాంతాల్లో వైద్య ఫలితాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు

అమెరికాలోని మయో క్లినిక్, క్లీవ్‌ల్యాండ్ క్లినిక్‌ల వంటి సంస్థలు దశాబ్దాల దూరదృష్టి, సంకల్పంతో ఎదిగాయని పేర్కొన్న ఆయన, అమరావతిలో కూడా అలాంటి ప్రపంచ స్థాయి వైద్య వ్యవస్థ ఏర్పడేందుకు పునాది వేస్తున్నామని తెలిపారు.

ప్రపంచ మెడికల్ టూరిజం విలువ 70-80 బిలియన్ డాలర్ల వరకు ఉందని, భారత్, థాయిలాండ్, సింగపూర్, మలేషియా ఈ రంగంలో ముందున్నాయని చెప్పారు. సరైన మౌలిక వసతులు, అంతర్జాతీయ విమానాశ్రయం, గ్రీన్ వాతావరణం ఉంటే అమరావతి కూడా ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం హబ్‌గా ఎదుగుతుందని వివరించారు.

అమెరికాలో పనిచేస్తున్న వైద్యుల్లో 20-30 శాతం భారతీయులేనని, అందులో తెలుగువారు అధికంగా ఉన్నారని పేర్కొన్నారు. సరైన మౌలిక వసతులు కల్పిస్తే అమెరికాతో పోలిస్తే 70-80 శాతం తక్కువ ఖర్చుతోనే ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించవచ్చన్నారు.

భారతదేశం ప్రపంచంలోనే అత్యంత యువ దేశమని, యువతకు సరైన నైపుణ్యాభివృద్ధి కల్పిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న క్వాంటం టెక్నాలజీ ప్రాముఖ్యతను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుగానే గుర్తించి రాష్ట్రంలో క్వాంటం మిషన్ ప్రారంభించారని తెలిపారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలలో దేశంలోని ప్రముఖ సంస్థలను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడంలో ముఖ్యమంత్రి చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఏపీలోనే 5వ తరం ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ టెక్నాలజీ అభివృద్ధి లక్ష్యం అన్నారు. భారత్‌లో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో అమెరికా తర్వాత అత్యాధునిక 5వ తరం ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల తయారీ సాంకేతికతను అభివృద్ధి చేసేందుకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహకారంతో ప్రయత్నాలు జరుగుతున్నాయని సతీష్ రెడ్డి వెల్లడించారు.

ఏఐ ఆధారిత వైద్య పరికరాల తయారీలో కిమ్స్ ముందంజ అన్నారు. కిమ్స్ హాస్పిటల్, రీసెర్చ్ ల్యాబొరేటరీ ద్వారా అందిస్తున్న సేవలను ప్రశంసించిన ఆయన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత అత్యాధునిక కెమెరా అద్దాలను కేవలం రూ. 6 వేలకే అందుబాటులోకి తీసుకురావడం విశేషమన్నారు. వైద్య పరికరాల తయారీలో విదేశాలపై ఆధారపడకుండా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యంతో దేశీయ తయారీని ప్రోత్సహించాలన్నారు. పరిశోధన, తయారీ రంగాల అభివృద్ధితో భారీ ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. రీసెర్చ్, మ్యానుఫ్యాక్చరింగ్ రంగాలు అభివృద్ధి చెందితే రాష్ట్ర యువతకు భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని సతీష్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

అమరావతి రాజధానికి భూములు ఇచ్చిన రైతుల గౌరవార్థం ఆసుపత్రిలోని ప్రతి బ్లాక్‌లో గదులకు వారి పేర్లు పెడతామని తెలిపారు.

హైదరాబాద్‌ను ఐటీ, ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్ రంగాల్లో ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అమరావతిని కూడా అద్భుతమైన రాజధానిగా తీర్చిదిద్దాలని సంకల్పించారని అన్నారు.

**30 వేల మంది రైతుల త్యాగం మరువలేనిది**

సుమారు 30 వేల మంది రైతులు 33 వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణం కోసం ఇవ్వడం సాధారణ విషయం కాదని, అది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు.

**ఉపాధి కల్పనపై సీఎం ప్రత్యేక దృష్టి**

కిమ్స్ ఆసుపత్రి ప్రారంభోత్సవ సమయంలో "ఈ సంస్థ ద్వారా ఎంతమందికి ఉపాధి లభిస్తుంది?" అని ముఖ్యమంత్రి అడిగారని, ప్రజల సంక్షేమం, దేశాభివృద్ధిపై ఆయనకు ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు. దార్శనిక నాయకత్వంతోనే సమాజంలో మార్పు సాధ్యం అన్నారు. సమాజంలో గొప్ప మార్పులు రావాలంటే చంద్రబాబు నాయుడు వంటి దూరదృష్టి కలిగిన నాయకత్వం అవసరమని బొలినేని భాస్కర్ రావు పేర్కొన్నారు.

కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు గంటి హరీష్, మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, బొలినేని శ్రీనయ్య, అమరావతి రాజధానికి భూములు ఇచ్చిన రైతులు, మెడికల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ రైతులకు శుభవార్త.. పంటల కనీస మద్దతు ధరలు పెంపు

○ **రైతుల ఆదాయం పెంచే దిశగా కేంద్రం కీలక నిర్ణయం**

○ **కేంద్ర ప్రభుత్వానికి మంత్రి అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : దేశ రైతాంగ సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. 2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు రైతులకు భారీ ఊరటనిచ్చే నిర్ణయమని ఆయన అభినందించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతుల ఆదాయ వృద్ధి, వ్యవసాయ రంగ బలోపేతం లక్ష్యంగా తీసుకుంటున్న నిర్ణయాలు దేశవ్యాప్తంగా రైతుల్లో నూతన నమ్మకాన్ని పెంచుతున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఖరీఫ్ పంటల ఎంఎస్‌పీ పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 2 లక్షల 60 వేల కోట్ల భారీ వ్యయాన్ని ఆమోదించడం రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

పెట్టుబడి ఖర్చుకు కనీసం 50 శాతం లాభం జోడించి మీఫా ధరలు నిర్ణయించడం రైతులకు నిజమైన భరోసా కల్పించే చర్యగా అభివర్ణించారు. రైతు కష్టానికి తగిన గిట్టుబాటు ధర కల్పించాలన్న సంకల్పంతోనే పలు పంటల ఎంఎస్‌పీ లను గణనీయంగా పెంచిందని పేర్కొన్నారు. వరి కామన్ రకానికి క్వింటాల్‌కు రూ. 72 పెంచి రూ. 2441, గ్రేడ్-ఏ వరికి రూ. 2461 నిర్ణయించడం రైతులకు లాభదాయకమని తెలిపారు. జొన్నకు రూ. 4073, రాగికి రూ. 5205, సజ్జలకు రూ. 2900, ఉలవలకు రూ. 8200, మొక్కజొన్నకు రూ. 2410, నువ్వులకు రూ. 10,346, సన్‌ఫ్లవర్‌కు రూ. 8343, పత్తికి రూ. 8667, వేరుశనగకు రూ. 7517 వరకు మీఫా పెంపు ప్రకటించడం రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న వ్యయభారం, ఎరువులు, విత్తనాలు, కార్మిక ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రైతుల ఆర్థిక స్థితిని మరింత బలోపేతం చేస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. రైతు సంక్షేమమే దేశ అభివృద్ధికి పునాది అన్న దృక్పథంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని కొనియాడారు. రాష్ట్రంలోని రైతులు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎంఎస్‌పీ లను పూర్తిస్థాయిలో పొందేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలు, మార్కెటింగ్ వ్యవస్థ, మద్దతు ధర అమలు ప్రక్రియలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతాంగానికి అండగా నిలుస్తూ వ్యవసాయ రంగాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చారిత్రాత్మక నిర్ణయాలకు రాష్ట్ర రైతుల తరఫున మంత్రి అచ్చెన్నాయుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## కేంద్ర కేబినెట్ నిర్ణయాలు మేలు చేస్తాయి

○ **కేంద్ర కేబినెట్ నిర్ణయాలు రైతులు, పరిశ్రమలకు మేలు చేస్తాయి**

○ **బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్)** : పి.వి.ఎన్. మాధవ్ కేంద్ర కేబినెట్ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను స్వాగతించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీనాయకత్వంలో రైతులు, రైల్వేలు, పరిశ్రమలు, మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరల అమలుకు రూ. 2.60 లక్షల కోట్ల కేటాయింపు చేయడం రైతులకు ఎంతో ఉపయుక్తమవుతుందని అన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు రూ. 37,500 కోట్ల కేటాయింపు చేయడం ద్వారా దేశీయ పరిశ్రమలకు ఊతం లభిస్తుందని, దిగుమతి ఇంధనాలపై ఆధారాన్ని తగ్గించే దిశగా ఇది కీలక నిర్ణయమని తెలిపారు. 86

గుజరాత్‌లో సర్కేజీ-ధోలేరా సెమీ హైస్పీడ్ రైల్వే లైన్‌కు ఆమోదం ఇవ్వడం దేశ రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. అలాగే నాగపూర్ అంతర్జాతీయ విమానాశ్రయ ఆధునికీకరణ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. దేశ ఆర్థికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, రైతు సంక్షేమం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని మాధవ్ తెలిపారు.

# ఉత్తమ ప్రతిభావంతులైన జర్నలిస్టులకు అవార్డులు




**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** జర్నలిజం రంగంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన మీడియా ప్రతినిదులు 2025-26సంవత్సరానికి గాను అవార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ అన్నారు. స్థానిక మీడియా అకాడమీ కార్యాలయంలో సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ తో కలిసి బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అవార్డుల ఎంపిక, ప్రదానం కోసం మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ చైర్మన్ గా నలుగురు సభ్యులతో కూడిన కమిటీ ని ప్రభుత్వం నియమించిందని ఆయన వెల్లడించారు. ఇండియా టుడే పూర్వ ఎడిటర్ ఏ.ఏ.వి. ప్రసాద్, ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం ఇంచార్జి వైస్ ఛాన్సలర్ ప్రొ.డి.వి.ఆర్. మూర్తి, రిటైర్డ్ హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్యన్నారాయణ మూర్తి సభ్యులుగాను, సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ మెంబర్ కన్వీనర్ గాను వ్యవహరిస్తారన్నారు

ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో జారీ అయిన ఉత్తరువుల ప్రకారం 12 అవార్డులను ఇవ్వనున్నట్లు చైర్మన్ తెలిపారు. వీటిలో కొన్నింటిని కమిటీ విచక్షణ తో, మరి కొన్నిటిని దరఖాస్తులు కోరి అర్హులైన వారిని ఎంపిక చేస్తామన్నారు. లైఫ్ టైం అఛీవ్ మెంటు అవార్డుకు రూ. 3 లక్షలు, ఉత్తమ జర్నలిస్టు, ఉత్తమ ఫోటో జర్నలిస్టు అవార్డులకు రూ. 2 లక్షలు చొప్పున, మిగిలిన అవార్డులకు రూ 1 లక్ష చొప్పున ప్రైజ్ మని ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆయా అవార్డులకు అ-ర్హతలు, దరఖాస్తుకు చివరి తేదీ లను తెలుపుతూ ప్రకటన విడుదల చేయడం జరుగుతుందన్నారు.

జర్నలిస్టుల అవార్డులకు సంబంధించి కనీస అనుభవం మాత్రమే పేర్కొనడం జరిగిందని, దానికి, అక్రిడేషన్లకు సంబంధం లేదని చైర్మన్ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ మాట్లాడుతూ జర్నలిస్టుల అవార్డులు ప్రతి యేటా ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించిందని అన్నారు. 2017 తరువాత మళ్ళీ 2025-26 సంవత్సరానికి ఉత్తమ ప్రతిభ కనపరిచిన జర్నలిస్టులకు అవార్డులు ఇచ్చే సాంప్రదాయాన్ని ప్రభుత్వం పునరుద్ధరించిందని ఆయన తెలిపారు. ఒక వారం రోజుల్లో అవార్డులకు సంబంధించిన ప్రకటనను విడుదల చేసి, అవార్డులకు అర్హులైన జర్నలిస్టులను గుర్తించి జులై నెల లో అవార్డుల ప్రదానం జరిగే లా కృషి చేయడం జరుగుతోందని ఆయన తెలిపారు.

పాత్రికేయుల సమావేశంలో సి.ఆర్. మీడియా అకాడమీ సెక్రెటరీ వి. మణిరాం, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ ఐ. సూర్య చంద్ర రావు, డిప్యూటీ డైరెక్టర్ డి. రమేష్, సి.ఆర్. మీడియా అకాడమీ మేనేజర్ ఎం.భాస్కర నారాయణ విజయవాడ రాష్ట్ర సమాచార కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వి. మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు జీజీహెచ్‌లో అత్యాధునిక పెట్ స్కాన్ సిద్ధం

○ **అమెరికా నుంచి తెప్పించిన దీని వ్యయం రూ. 18 కోట్లు**

○ **క్యాన్సర్ గుట్టును పసిగట్టే ఈ స్కాన్ ప్రభుత్వాసుపత్రుల్లో ఏర్పాటుకావడం ఇదే తొలిసారి**

○ **పేదల ఆరోగ్య సంరక్షణ కోసం కూటమి ప్రభుత్వం కృషి**

○ **రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి**





**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :ప్రైవేట్ కార్పొరేట్ అసుపత్రులకు మాత్రమే పరిమితమైన అత్యాధునిక పెట్ స్కాన్ (క్యాన్సర్ గుట్టును పసిగట్టే) గుంటూరులోని ప్రభుత్వ బోధనాసుపత్రిలో సిద్ధమైంది. పేద, మధ్యతరగతి రోగులకు క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన అత్యుత్తమ వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు ప్రభుత్వాసుపత్రుల్లోనే తొలిసారిగా గుంటూరు జీజీహెచ్లో ఆధునిక సౌకర్యాల మధ్య ఈ పెట్ స్కాన్ (Positron Emission Tomography) ను కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. క్యాన్సర్ వైద్యంలో ఇదొక మైలురాయి కాబోతుంది. ఇందుకోసం సుమారు రూ. 18 కోట్ల వరకు కూటమి ప్రభుత్వం వ్యయంచేసింది. పెట్ సి.టి స్కాన్ ద్వారా క్యాన్సర్ వైద్య సేవలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం సాయంత్రం లాంఛనంగా ప్రారంభించబోతున్నారు.

**ఉచితం.. ఉచితం..**

ప్రస్తుతం రాష్ట్రంలో 18 ప్రైవేట్ కార్పొరేటు ఆసుపత్రుల్లో పెట్ స్కాన్ సదుపాయం అందుబాటులో ఉంది. విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం, ఇతరచోట్ల అందుబాటులో ఉన్న ఈ పెట్ స్కాన్ సౌకర్యాన్ని రోగుల ఆరోగ్య సంరక్షణ దృష్టిలో పెట్టుకుని గుంటూరు జీజీహెచ్ లో అందుబాటులోనికి తెచ్చామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడొక ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ అసుపత్రుల్లో పెట్ స్కాన్ ద్వారా పరీక్షలు చేయించుకునే వారి నుంచి సగటున రూ. 20వేల వరకు తీసుకుంటున్నారు. గుంటూరు జీజీహెచ్ ఆవరణలో ఉన్న నాట్కో క్యాన్సర్ కేంద్రంలో పరీక్షలు చేయించుకునే వారి నుంచి ఎటువంటి ఫీజు తీసుకోరు.

**నాక్, హెచ్ఎఆర్, సిటి స్టిమ్యులేటర్ సర్జికల్ ఎక్విప్‌మెంట్స్‌కు అదనంగా..**

గుంటూరు జీజీహెచ్ లోని నాట్కో క్యాన్సర్ కేంద్రంలో రూ. 41 కోట్లతో అత్యాధునిక పరికరాలు/యంత్రాలు సమకూర్చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. లెవల్-1 స్థాయిలో ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దేందుకు ఇప్పటికే లినాక్, హెచ్ఎఆర్ బ్రాకీథెరఫీ, సి.టి స్టిమ్యులేటర్ వంటి అత్యాధునిక సర్జికల్ పరికరాల్ని ప్రభుత్వం సమకూర్చింది. ఈ క్రమంలోనే యూఎస్ఏ నుంచి పెట్ స్కాన్ ను తెప్పించింది. ట్రయల్ రన్ విధానంలో దీని పనితీరును నిశితంగా పరిశీలించారు. ఇప్పటివరకు 50 మంది రోగులను పరీక్షించారు. ఈ కేంద్రంలో రేడియేషన్ ఆంకాలజీ, సర్జికల్, మెడికల్, న్యూక్లియర్, ప్రివెంటివ్ అంకాలజీ, పెయిన్ అండ్ పాలియేటివ్ కేర్ సర్వీసెస్ ప్రారంభమయ్యాయి.

**కార్డియాలజీ, న్యూరాలజీ, ఇతర సూపర్ స్పెషాలిటీల అవసరాలకు తగ్గట్టు...**

రాష్ట్ర విభజన అనంతరం క్యాన్సర్ రోగులు పడుతున్న ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకుని నాట్కో ట్రస్టు వారు అంతర్జాతీయ ప్రమాణాలతో రూ. 15 కోట్ల వ్యయంతో అత్యాధునిక క్యాన్సర్ కేంద్రాన్ని నాలుగున్నరేళ్ల కిందట నిర్మించారు. క్యాన్సర్ వైద్య సేవల నిమిత్తం అవసరమైన 114 మంది వైద్యులు, సాంకేతిక నిపుణులు, పారా మెడికల్, ఇతర సిబ్బందిని కూటమి ప్రభుత్వం నియమించింది. గడిచిన ఏడాదిలో ఓపీ ద్వారా 19,598 మంది రోగులు, ఐపీ ద్వారా 6.942 మంది రోగులు చికిత్స పొందారు. 3,363 మంది కిమోథెరపీ, 965 మంది రేడియేషన్ థెరపీ చేయించుకున్నారు. 1,131 మందికి క్యాన్సర్ సర్జరీలు జరిగాయి. ఇన్ఫెక్షియస్ డీసిజెస్, హెమటాలజీ, కార్డియాలజీ, నూరాలజీ, పల్మనాలజీ, ఎండోక్రైనాలజీ, ఆర్థోఫెడిక్స్ వైద్యులు కూడా రోగుల వ్యాధుల నిర్ధారణకు పెట్ స్కాన్ ను ఉపయోగిస్తున్నారు.

**క్యాన్సర్ కణం ఎక్కడ దాగి ఉన్నా సరే..**

శరీరంలో క్యాన్సర్ కణం ఎక్కడున్నా కచ్చితంగా గుర్తించేందుకు ఈ పెట్ స్కాన్' ఉపయోగపడుతుంది. దీని సాయంతో క్యాన్సర్ ఏ దశలో ఉంది? ఎక్కడెక్కడికి విస్తరించిందనేది స్పష్టం తెలుసుకోవడానికి వీలుంది. సి.టి స్కాన్‌లో ఎముకలు, ఎంఆర్ ఐలో కణజాలం కనిపిస్తాయి. పెట్ స్కాన్ లో క్యాన్సర్ కణితిని కచ్చితంగా నిర్ధారించి చుట్టుపక్కల అవయవాలేవీ ప్రభావితం కాకుండా అందులో ఏ ప్రాంతానికి ఎంత రేడియేషన్ ఇవ్వాలో వైద్యులు నిర్ణయిస్తారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467